



ధాన్యం సేకరణ మొక్కుబడి

ఏటికేడు కుచించుకుపోతున్న ధాన్యం సేకరణ

- ఇప్పటి వరకు కొన్నది 21,500 మెట్రిక్ టన్నులే
- ఇంకో 5,000 టన్నులు వస్తే గగనమే
- నిర్దేశించుకున్న లక్ష్యం 78,000 టన్నులు
- అన్నదాతలకు ఎండమావిగా మారిన మద్దతు ధర

బాపట్ల, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ఘనంగా లక్ష్యాలను నిర్దేశించుకోవడం.. ముగింపు కొచ్చేసరికి మొక్కుబడి సేకరణతో మమ అనిపించడం ధాన్యం సేకరణలో ప్రభుత్వానికి అలవాటుగా మా రింది. ఏటికేడు మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు పరిమాణం తగ్గుతూ వస్తుండడం మరింత ఆందో ళన కలిగిస్తోంది. రైతులకు మేలు చేయడానికి ప్రవే శపెట్టిన మద్దతు ధర వల్ల వారికి ఒనగూరుతున్న ప్రయోజనం ఎంత అనేది ఈ గణాంకాలతో తేలు తోంది. ఈ ఏడాది 78,000 మెట్రిక్ టన్నుల ధాన్యా న్ని అన్నదాతల వద్ద నుంచి మద్దతు ధరకు కొను గోలు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుతం సేకరించిన ధాన్యం కేవలం 21,500 మెట్రిక్ టన్నులే కాగా మహా అయితే సీజన్ ముగి సేసరికి ఇంకో 5,000 మెట్రిక్ టన్నులను మద్దతు ధరకు కొనుగోలు చేసే అవకాశముంది.

ఏటికేడు తగ్గుదల నమోదు...

రైతుభరోసా కేంద్రాల ద్వారా మద్దతు ధరకు ధాన్యం సేకరించే విషయంలో ప్రతి సీజన్‌కు తగ్గుదలే నమోదవడం రైతులపై ప్రభుత్వానికి ఉన్న చిన్న చూపునకు నిదర్శనంగా కనబడుతోంది. గతేడాది ఇదే సీజన్‌లో 1,40,000 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరిం చాలని లక్ష్యంగా పెట్టుకోగా ముగింపు కొచ్చేసరికి అది కాస్తా 78,334 మెట్రిక్ టన్నులకే పరిమితమైంది. ఈ ఏడాది నిర్దేశించుకున్న లక్ష్యమే అతి స్వల్పంగా 78,000 టన్నులు కాగా అంతా కలిపి 26,500 దగ్గరే సేకరణ ముగి సిపోయే సూచనలు కనిపిస్తున్నాయి. వాస్తవానికి మొ త్తం దిగుబడి దాదాపు జిల్లాలో మూడున్నర లక్షల మెట్రిక్ టన్నులపైనే ఉండే అవకాశం ఉంది. అంటే దిగుబడిలో పదిశాతం కూడా మద్దతు ధరకు అన్నదాతల నుంచి ధాన్యం సేకరించలేని దురవస్థలో ప్రభుత్వం ఉంది.

బహిరంగ మార్కెట్‌లో అమ్ముకుని..

అలవిమాలిన నిబంధనలకు తోడు డబ్బులు చెల్లింపులో ఎడతెగని జాప్యం వల్లే అన్నదాతలు ధర తక్కువైనా దళారులను ఆశ్రయించి నిలువునా వంచనకు గురవు తున్నారు. మిచౌంగ్ తుఫాన్ వల్ల భారీగా నష్టపోయిన అన్నదాతలను ఆదుకోవడానికి తేమ, రంగుమారిన ధాన్యం కొనుగోలు విషయంలో ఉదారంగా వ్యవహరి స్తామని ప్రభుత్వం చెప్పిన మాటలు ఉత్తమాటలుగానే మిగిలిపోయాయని క్షేత్రస్థాయి పరిస్థితులు చెబుతున్నా యి. సడలించిన నిబంధనల ఆధారంగా అన్నదాతల వద్ద కనీసం వెయ్యి టన్నుల ధాన్యాన్ని కూడా అధి కారులు సేకరించిన దాఖలాలు లేవు. మిచౌంగ్ తుఫాన్ వల్ల తీసి కట్టుగా వేసుకున్నా కనీసం పదివేల టన్నుల ధాన్యం డ్యామేజీ అయిందనేది అధికారుల అంచనా. అందులో కనీసం పదిశాతం ధాన్యం కూడా ఆర్‌బీకేల వద్దకు చేరలేదు.

మూడు వారాల్లో నగదు జమ అనేది ప్రగల్భాలే...!

మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేసిన మూడు వారాల్లోపే అన్నదాతల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామనే ప్రగల్భాలుగానే మిగిలిపోతున్నాయి తప్పితే ఆచరణలో అమలు అవుతున్న దాఖలాలు మచ్చుకైనా కనబడడం లేదు. ఇంకా దాదాపు 1,200 మంది రైతులకు సంబంధించి రూ.8 కోట్లు బకాయిలు ఉన్నట్లు సమాచారం. వీరంతా ధాన్యాన్ని ఆయా రైతుభరోసా కేంద్రాలలో అమ్మి ఇప్పటికే నాలుగు వారాలు గడవగా ఇంకా వారి ఖాతాల్లో డబ్బు జమ కాలేదు.

దిగుబడులు తగ్గిపోయి..

మిచౌంగ్ తుఫాన్ ధాటికి అంచనా వేసిన దిగుబడుల్లో దాదాపు సగం తగ్గిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రకృతి విపత్తుకు తోడు ఈ ఏడాది పెట్టుబడి ఖర్చులు కూడా రెట్టింపయ్యాయని వాపోతున్నారు. ధాన్యాన్ని ఆర్‌బీకేలకు తీసుకెళ్లి మరీ నిబంధనల చిట్టా చూసి భయపడిపోయి అయిన కాడికి బయటే ధాన్యాన్ని అమ్ముకున్నామని రైతులు కన్నీటిపర్యంతమవుతున్నారు. మరోవైపు తుఫాన్ పరిహారం సంక్రాంతి లోపు ఇస్తామన్నారని ఇప్ప టివరకు అతీగతి లేదని కనీసం అది అందినా ఎంతో కొంత ఉపయోగకరంగా ఉండేదని రైతులు చెబుతున్నారు.

ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం అడ్మిషన్లు

- జిల్లా విద్యాశాఖాధికారి నారాయణరావు

బాపట్ల, ఫిబ్రవరి 13: జిల్లాలోని అన్ని ప్రైవేట్ ఉన్నత పాఠశాలలో 25శాతం 1వ తరగతి విద్యార్థుల అడ్మిషన్‌ల కోసం సీట్లు కేటాయించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి నారాయణరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. దీనికి సంబంధించి జిల్లాలోని అన్ని మండల విద్యాశాఖాధికారి కార్యాలయాలలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలన్నారు. ఎవరికైన సందేహాలు ఉంటే హెల్ప్‌లైన్ నెంబరు 14417 నెంబర్‌లో సంప్రదించాలన్నారు. హెచ్‌ఐవీ ఎఫెక్టెడ్ చిల్డ్రన్స్‌కు 5శాతం, షెడ్యూల్ కులాలకు 10శాతం, షెడ్యూల్ తెగలకు 4శాతం, వీకర్ సెక్షన్, బలహీనవర్గాలు, మైనార్టీలు, అగ్రవర్ణాలవారికి 6శాతం చొప్పున మొత్తం 25శాతం సీట్లు కేటాయించటం జరిగిందన్నారు. రూరల్ పరిధిలో రూ.లక్షా20వేల ఆదాయం, పట్టణ పరిధిలో రూ.లక్షా44వేల లోపు ఆదాయం ఉన్నవారు అర్హులు అన్నారు. అడ్మిషన్ కొరకు పేరెంట్, విద్యార్థి ఆధార్‌కార్డు, ఓటరు ఐడీ కార్డు, ఎలక్ట్రిసిటీ బిల్లు, డ్రైవింగ్ లైసెన్స్, బియ్యం కార్డు, తహసీల్దార్ ధ్రువీకరణ, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సర్టిఫికెట్‌తో సీఎస్ఈ పోర్టల్ దరఖాస్తు చేసుకోవాలన్నారు.

బాగుపడే.. దారెక్కడ?

కొత్తగా రోడ్ల నిర్మాణానికి కాదుకదా.. అధ్వానంగా తయారై, ప్రమాదకరంగా మారిన రోడ్ల మరమ్మతులకు కూడా ప్రభుత్వం నిదులు ఒక్క రూపాయి విదిల్చిన పాపానపోలేదు. గతంలో చేసిన పనులకు సంబంధించి బిల్లులు భారీగా ప్రభుత్వం దగ్గర పెండింగ్ ఉండటంతో అప్పట్లో ఒప్పందం కుదుర్చుకున్న కాంట్రాక్టర్‌లూ పనులు చేయలేమని చేతులెత్తేశారు. దీంతో ప్రధాన రహదారుల కూడా డొంక రోడ్లకంటే హీనంగా తయారయ్యాయి. వీటిపై ఇటీవల కాగ్ అనేక అభ్యంతరాలు వ్యక్తం చేసింది. పనుల విషయంలో నిర్లక్ష్యం, నిధుల మంజూరులో జాప్యం, బిల్లుల చెల్లింపుల విషయంలో పట్టనట్టు వ్యవహరించటంపై కాగ్ తలంటినా ప్రభుత్వం మాత్రం మాకేటి సిగ్గన్నట్టు నిర్మాణ పనుల పురోగతిని గాలికొదిలేసింది. దీంతో మోకాళ్ల లోతు గుంటలలో ప్రయాణించలేక, తప్పనిసరి అయి ఏదైనా వాహనంలో వెళ్లినా ప్రమాదాలకుగురై ప్రాణాలు పోగొట్టుకోవలసి రావటం దారుణమే.


తెనాలి-విజయవాడ రోడ్డులో ఆటోనగర్ దగ్గర మూడేళ్ల క్రితం గోడలు నిర్మించి రోడ్డు పనులు చేయకుండా వదిలేసిన చిత్రం

- పాత పనులకు పాతర... కొత్త పనుల ఊసేలేదు
- నిధులివ్వని వైసీపీ ప్రభుత్వం... మధ్యలోనే ఆగిన పనులు
- అధ్వానంగా రోడ్లు, వంతెనలు
- గత టీడీపీ సర్కారు కాలంలో నిధుల మంజూరు
- వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఒక్క పైసా విదిలించింది లేదు
- బిల్లుల పెండింగ్‌తో పాత పనులు చేయలేమని చేతులెత్తేసిన కాంట్రాక్టర్‌లు
- కొత్త పనులకు నిధుల మంజూరు లేనేలేదు

తెనాలి, ఫిబ్రవరి 13, (ఆంధ్రజ్యోతి): గత దశాబ్దకాలంలో జరగనన్ని రోడ్డు ప్రమాదాలు ఈ నాలుగేళ్లలోనే జరిగాయని ఆయా శాఖలు ఇచ్చిన నివేదికలు ఇస్తున్నాయి. కొత్త రోడ్ల నిర్మాణం అటుంచితే, పాతవాటికి పాతరేయడంతో రోడ్లపై తిరుగుతున్న జనం నడ్డి విరుగుతోంది. ప్రభుత్వం అనేక రూపాల్లో ఇస్తున్న సంక్షేమం డబ్బంతా వైద్యానికే సరిపోతుందంటూ ప్రతిపక్షాలూ ఎద్దేవా చేస్తున్నాయి. కాగ్ ఇటీవల ఇచ్చిన నివేదికలో గత ప్రభుత్వ కాలంలో మంజూరు చేసిన పనుల పురోగతి, కొత్తగా వచ్చిన ప్రభుత్వం ఇచ్చిన నిధుల పురోగతిపై నివేదిక


తెనాలి వీఎస్ఆర్ కళాశాల ఎదుట రహదారి దుస్థితి

ఇచ్చింది. పాత పనులు అటుంచితే, 2023లో మంజూరుచేసిన నిధులకు సంబంధించిన పనులు కూడా కేవలం 5 నుంచి 15 శాతంలోపే పూర్తికావటం విశేషం.

తెనాలి -విజయవాడ రోడ్డు పనులు హుష్..

తెనాలి- మంగళగిరి ప్రధాన రహదారి వెంట గోడల నిర్మాణం, రోడ్డు మరమ్మతులకోసం 2017లో రూ.46 కోట్లు కేటాయించారు. దీనితో రోడ్డుకు ఇరువైపులా తూర్పు, నిజాంపట్నం కాల్వల వెంట గోడలు నిర్మించాల్సి ఉంది. అయితే గోడల నిర్మాణం 2022వరకు చేసిన కాంట్రాక్టర్లు అప్పటి నుంచి బిల్లులు రాకపోవటంతో పనులు చేయటానికి చేతులెత్తేశారు. మంజూరు చేసిన పనుల్లో రూ.25కోట్ల వరకు పనులు మాత్రం పూర్తయ్యాయి. మొత్తంమీద కేవలం 2.8 కి.మీటర్ల పొడవున గోడలు, రోడ్డు అభివృద్ధి చెయ్యాల్సిఉంది. కానీ తెనాలి నుంచి మంగళగిరి మధ్య 1.5 కి.మీ నుంచి 3.8 కి.మీ మధ్య కేవలం 200 మీటర్ల వరకు మాత్రమే పని పూర్తిచేశారు. అయితే గతంలో చేసిన పనులకు సంబంధించిన బిల్లులే భారీగా పెండింగ్ ఉండటంతో కాంట్రాక్టర్ చేతులెత్తేశారు. ఇదే రోడ్డు నందివెలుగు నుంచి రేవేంద్రపాడు వరకు గోడలు, రోడ్డు అభివృద్ధికి రూ.264 కోట్లు మంజూరు చేస్తూ సీఎం అంగీకరించారని జగన్ సర్కారు వచ్చిన రెండు నెలలకు తెనాలి, మంగళగిరి ఎమ్మెల్యేలు విలేకరుల సమావేశం పెట్టిమరీ ఆర్భాటంగా ప్రకటించారు. ఆ నిధులు ఇప్పటివరకు ఏమయ్యాయో తెలియదు. రోడ్డు అభివృద్ధి అటుంచితే, నందివెలుగు- రేవేంద్రపాడు మధ్య రోడ్డు దారుణంగా తయారైంది. గుంతలుపడి, కుంగి, వాహనాలు కాలువలలోకి దూసుకు పోతున్న పరిస్థితి. గతంలో కార్లు కాల్వలోకి బోల్తాకొట్టి పదుల సంఖ్యలో ప్రాణాలు పోయిన పరిస్థితి ఉంది. రూ.264 కోట్లతో అభివృద్ధి అటుంచితే, అసలు మరమ్మతులకు కూడా దిక్కులేకుండా పోయింది. ఇదే రహదారి వెంట ప్రజాప్రతినిధులు వెళుతూనే ఉంటారు. వి.ఎస్.ఆర్ కళాశాల దగ్గర నుంచి ఆటో నగర్ వరకు రోడ్డు తూర్పు కాల్వవైపు పూర్తిగా దెబ్బతింది. మధ్యలో డివైడర్‌లు ఉండటంతో విజయవాడ నుంచి తెనాలి వైపునకు వచ్చే ప్రజాప్రతినిధులు తమ వాహనాలను నిబంధనలకు విరుద్ధంగా కుడివైపు రోడ్డుపైకి మళ్లించటం విశేషం. దుగ్గిరాల- రేవేంద్రపాడు మధ్య ద్విచక్ర వాహనం కూడా వెళ్లలేనంత దారుణంగా రోడ్డు తయారైందంటే దీనిపై శ్రద్ధ ఏపాటిదో అర్థమవుతుంది. మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రాజీనామా చేసిన తర్వాత ఇదే రోడ్డుపై ప్రస్తావన కూడాచేశారు. కనీసం దుగ్గిరాల వరకు రోడ్డుకూడా వేయలేకపోయాం, ఇది సిగ్గుగా ఉందని చెప్పారంటే ప్రభుత్వ వైఫల్యం ఏమేర ఉందో అర్థమవుతుంది.


అంగలకుదురు-దండమూడి మధ్య సగం పనులు జరిగితే అదికూడా ప్రస్తుతం గుంతలతో మారిన చిత్రం

చేబ్రోలు బ్రిడ్జికి గ్రహణం వీడేనా!

కొమ్మమూరు కాల్వపై చేబ్రోలు దగ్గర హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి 2019లోనే రూ.25కోట్లు మంజూరు చేశారు. ఈ వంతెన బ్రిటిష్ కాలంనాటిది కావటం, అప్పటినుంచి తాత్కాలిక మరమ్మతులు చేసుకుంటూవచ్చినా, శిథిల స్థితికి చేరుకోవటం, హైలెవల్‌లో ఉండటంతో భారీ వాహనాలు అదుపుతప్పి కాల్వలోకి దూసుకుపోవటం వంటి ఘటనలు చాలానే జరిగాయి. అప్పట్లో ఈ పాత వంతెన స్థానంలో కొత్త వంతెన నిర్మించాలి. అయితే అప్పట్లో జల రవాణా కింద ప్రధాన కాల్వ కింద ఇది ఉండటంతో నీటిపారుదల శాఖ అభ్యంతరం చెప్పింది. ఒకవేళ నిర్మిస్తే జల రవాణాకు సంబంధించి కాల్వ ఎంత వెడల్పు చేయాలనే ప్రతిపాదన ఉందో అంత వెడల్పు, కేంద్రం సూచించిన ఎత్తులో వంతెన నిర్మించుకుంటే అభ్యంతరం లేదని తేల్చి చెప్పటం, ఆ ప్రతిపాదనలు మళ్లీ రివైజ్ చెయ్యాల్సిరావటంతో అత్యవసరం కింద ప్రస్తుతం రూ.50 లక్షలతో ఇనుప గడ్డర్ల సాయంతో బయిలీ వంతెన నిర్మించాలని ఆర్‌అండ్‌బీ నిర్ణయించింది. దీనికోసం అప్పట్లో ఇనుప గడ్డర్లు తీసుకొచ్చినా వాటినీ నిర్మించకుండా వదిలేశారు. అప్పటి నుంచి దీని నిర్మాణానికి కొర్రీలు పడుతుండటం, జగన్ సర్కారు వచ్చాక కొత్త వంతెన నిర్మించటానికి 2023లో రూ.35కోట్లు మంజూరు చేయటం జరిగిపోయాయి. అయితే ఈ నిధులతో పనులు మొదలుపెడితే, మళ్లీ నీటిపారుదల శాఖ అభ్యంతరం వ్యక్తం చేసింది. అయితే ఈసారి కాంట్రాక్టర్ నీటిపారుదల శాఖ అభ్యంతరాలను తోసిపుచ్చి నిర్మాణ పనులను మొదలుపెట్టేసింది. అయితే రెండువైపులా నాలుగు పిల్లర్లు వేసి, పనులు చేస్తున్నామనిపిస్తున్నారు. దీనికోసం ఏకంగా బాపట్ల, ప్రకాశం జిల్లాల్లోని రైతుల పంటలకు నీటిని, తాగునీటిని ఆపేసి మరీ పనులు చేపట్టారు. అప్పట్లో రైతులు ఆందోళన చేయటంతో చివరకు పనులు మధ్యలోఆపి, నీటిని వదిలారు. ఇప్పుడు ఖరీఫ్ చివరి దశకుచేరి, రబీ సాగుకు నీటిని ఆపేశారు. దీనికితోడు పాత వంతెనకు అటో, ఇటో కొత్త వంతెన నిర్మించటం సహజం. అయితే అక్కడ ఇబ్బందులు, సాధ్యాసాధ్యాలను పరిశీలించాకే నిర్మాణ పనులు మొదలుపెడతారు. కానీ ఇక్కడ పొన్నూరు ఛానల్ ఉంటే, దాని కల్వర్టును మూసేసి మరీ వంతెన నిర్మాణ పనులు చేపట్టారు. ఈ కాల్వ ద్వారా పొన్నూరు మండలంలోని 8 గ్రామాల పరిధిలోని పొలాలకు నీరు అందుతుంది. ఈ కాల్వను పూర్తిగా మూసేశారు. అయితే దీనిపై నీటిపారుదల శాఖ మాత్రం ఏ అభ్యంతరం చెప్పకుండా, రైతులు గోలపెడుతున్నా పట్టించుకోకుండా వదిలేసింది. వంతెన నిర్మాణానికి అన్ని రకాల అనుమతులు తీసుకోకపోవటం, నిర్మాణ సమయంలో ఇతర ఇబ్బందులను పట్టించుకోకపోటం విశేషం. 2023లో రూ.35 కోట్లు మంజూరుచేసినా పనులు మాత్రం భూమిలో పిల్లర్ల వరకే పరిమితమయ్యాయి. ఈ వంతెన విషయంలోనూ గందరగోళ పరిస్థితులు నెలకొన్నా అన్నీ గాలిలో పెట్టేశారు. అన్నీ లోపభూయిష్టంగా తయ్యాయి.

గత ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా..

గత ప్రభుత్వ కాలంలో గుంటూరు, బాపట్ల జిల్లాల్లో పలు రోడ్లకు భారీగానే నిధులు మంజూరు చేసింది. తెనాలి మండలం అంగలకుదురు నుంచి పొన్నూరు మండలం దండమూడి మధ్య రోడ్డు 8.7 కి.మీటర్లు వేసేందుకు 2017లో రూ.10 కోట్లు మంజూరు చేశారు. అంగలకుదురు నుంచి చుండూరు మండలం వలివేరు అవతల వరకు 8.7 కి.మీటర్ల మేర రోడ్డు నిర్మించాల్సి ఉంది. అయితే దీనిలో ఇప్పటి వరకు కేవలం 51 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయి. ఐదేళ్ల క్రితం 5 కి.మీ తారురోడ్డు వేసి వదిలేశారు. ఆ తర్వాత ప్రస్తుత సీఎం జగన్ పర్యటన ఉండటంతో వలివేరు దగ్గర కొంతమేర బి.ఎం మిక్స్‌తో రోడ్డు వేసి చేతులు దులుపుకొన్నారు. అయితే ఈ పనులకు మరో బిల్లు నొక్కేశారు. ఇంకా సీసీ రోడ్డు, కల్వర్టుల నిర్మాణం ఉంటే వాటిని వదిలేశారు. తెనాలి నుంచి చందోలు వెళ్లే రోడ్డు వేయటానికి 2017లో రూ.8 కోట్లు కేటాయించారు. ఈ నిధులతో అమృతలూరు మండలంలోని మండూరు వంతెన దగ్గర నుంచి పెదపూడి వంతెన వరకు నిజాంపట్నం కాల్వలోకి రోడ్డు కుంగి ఊబిలోకి దిగిపోయింది. యలవర్రు వంతెన దగ్గరా రోడ్డు దెబ్బతినిపోయింది. రోడ్డుకు ఇరువైపులా తూర్పు కాల్వ, నిజాంపట్నం కాల్వలు ఉండటంతో కాల్వల అంచుల వెంట గోడ నిర్మించాల్సిఉంది. దీనిలో ఇప్పటివరకు కేవలం రూ.3.5 కోట్ల పనులు మాత్రమే చేయగలిగారు. కొద్దిమేర గోడ నిర్మించారు. మరికొంత తారు రోడ్డు వేశారు. అయితే పూర్తిస్థాయిలో పనులు పూర్తిచేయటానికి అవసరమైన మిగిలిన నిధులను వైసీపీ సర్కారు మంజూరు చేయకపోవటంతో పనులు మధ్యలోనే ఆగిపోయాయి. దీంతో లారీల దగ్గర నుంచి కార్లవరకు మార్గంలో కాల్వలోకి బోల్తాపడుతున్నాయి. రెండు కి.మీ మేర రోడ్డు మధ్యకు బద్దలుగా పగిలిపోయి భూకంపం వచ్చిన ప్రాంతాల్లో ఉన్న ట్టుగా కిందికి కుంగిపోయింది. ఇంతటి ప్రమా దకరంగా ఉన్నా జగన్ సర్కారు మాత్రం వీటిగోడు పట్టించుకున్నదే లేదు. పొన్నూరు మండలం నిడమర్రు నుంచి అమృ తలూరు మండలం ప్యాపర్రు వరకు రోడ్డు అభివృద్ధి కోసం రూ.2.5 కోట్లు కేటాయించారు. ఈపనులు 2023 నాటికే పూర్తి కావలసి ఉంటే ఇప్పటికి 5 శాతం పనులు కూడా పూర్తికాలేదు.దీనికీ నిధుల గ్రహణమే.


ఫుట్‌పాత్‌లు అధ్వానం

ఆమంచిగా.. ముంచేసి..!

- పర్చూరు వైసీపీ ఇన్‌చార్జిని తప్పించే ఆలోచనలో పాలకపార్టీ
- యడం బాలాజీని నియమించే అవకాశం !
- పార్టీని భ్రష్టుపట్టించారని వైసీపీ శ్రేణుల ఆవేదన
- ఓట్ల అక్రమాల విషయంలో బజారున పడ్డ పార్టీ పరువు
- అధికారులను బలిచేశారు.. సొంతపార్టీ శ్రేణులపైనే కక్ష
- ఎంచక్కా దుకాణం సర్దేస్తున్నారని వైసీపీ కార్యకర్తల మండిపాటు

బాపట్ల, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): గతేడాది ఫిబ్రవరిలో ఆ నేత పర్చూరు నియోజకవర్గానికి వైసీపీ ఇన్‌చార్జిగా వచ్చారు.. ఇక అంతే అప్పటినుంచి ఆయన తనదైన శైలిలో రాజకీయం చేయడం ప్రారంభించారు. ముఖ్యంగా ఓట్ల అవకతవకల విషయంలో ఇక ఆయన అడుగులకు మడుగులొత్తిన పాపానికి నలుగురు పోలీసులు సస్పెన్షన్‌కు గురయ్యారు. ఇక ఎంతోమంది రెవెన్యూ ఉద్యోగులు ఈసీ ముందు పలు సందర్భాల్లో వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది. కొంత మంది ఆ నేత ఒత్తిడి భరించలేక గుండెపోట్లు తెచ్చుకొని సెలవుమీద వెళ్లిన సందర్భాలూ ఉన్నాయి. ఇక ఓ సామాజిక వర్గాన్ని ఉద్దేశిస్తూ ఆ నేత చేసిన దుందుడుకు వ్యాఖ్యలు రాష్ట్రవ్యాప్తంగా వైసీపీకి నష్టం చేకూర్చాయి. సొంత పార్టీల నేతలను సైతం కేసుల్లో ఇరికించి వికృతానందం పొందారు. తాపీగా తాను అక్కడనుంచి పోటీ చేయడం లేదని తేల్చేశారు. ఒక్క మాటలో చెప్పాలంటే ఈ ఏడాది కాలంలో పార్టీని నష్టపరిచి సర్దుకుని పలాయనం చిత్తగిస్తున్నారన్న మాటలు వైసీపీ శ్రేణుల నుంచే వినపడుతున్నాయి.

పార్టీని డ్యామేజీ చేశారు...

పర్చూరులో సదరు నేత చర్యల వల్ల రాష్ట్రవ్యాప్తంగా పార్టీకి డ్యామేజీ జరిగిందని వైసీపీ పెద్దలు నిర్ణయానికి రావడంతో మార్పు దిశగా చర్యలు చేపట్టారని తెలుస్తోంది. ఆ నేత తాను అక్కడ నుంచి పోటీ చేయనని, చేస్తానని పలుమార్లు తాడేపల్లి పెద్దలను సైతం గందరగోళానికి గురి చేశారన్న విమర్శ ఉంది. ఈ మొత్తం ఎపిసోడ్‌లో ఆరంభం నుంచి పర్చూ రులో అతని నియామకాన్ని వ్యతిరేకిస్తూ వచ్చిన ఉమ్మడి ప్రకాశానికి చెందిన మాజీ మంత్రి అభీష్టానికి అనుగుణంగానే ఆ నేతను తప్పించి బాలాజీకి అవకాశం ఇవ్వనున్నారని తెలుస్తోంది.

అంతా అయిపోయాక ఇప్పుడెందుకు..

పర్చూరు నియోజకవర్గంలో వైసీపీకి దింపుడు కళ్లెం ఆశలు తప్ప ఇంకేమి మిగలలేదని దీనంతటికి కారణం సద రు నేతేనన్న ఆగ్రహంతో వైసీపీ శ్రేణులు ఉన్నాయి. తొలి నుంచి ఆ నేత అరాచకాలను పార్టీ పెద్దల దృష్టికి తీసుకెళ్లినా వారికీ వాటాలు వెళ్లడంతో కిమ్మనకుండా ఉన్నారని, ప్రస్తుతం ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఈ మార్పు చేయడం వల్ల ఉపయోగం ఏమిటనే ప్రశ్నను వైసీపీ ద్వితీయశ్రేణి నేతాగణం పార్టీ పెద్దలకు సంధిస్తోంది.

వెళ్లిపోవచ్చు.. అభ్యంతరం ఏమీలేదు..

సదరు నేత బాపట్ల జిల్లాలోని ఇంకో నియోజకవర్గంలో తనకు పోటీకి అవకాశం కల్పించాలని తాడేపల్లి పెద్దల వద్ద గతంలోనే ప్రతిపాదనలు పెట్టారు. అప్పటికే అతని చర్యలతో విసిగిపోయి ఉన్న అధిష్టానం పార్టీలో మరెక్కడా సీటు కేటాయించే పరిస్థితి ప్రస్తుతం లేదని, చేసిన నష్టం చాలని అన్నట్లు సమాచారం. పార్టీలోనే ఉండి చికాకులు సృష్టించవద్దని ఇష్టముంటే ఉండొచ్చని లేకుంటే పార్టీని వీడినా ఎలాంటి అభ్యంతరం లేదని తాడేపల్లి పెద్దలు సదరు నేతకు తేల్చి చెప్పినట్లు సమాచారం.

కాలూ చెయ్యి కూడదీసుకుని..

సదరు నేత అక్రమ వసూళ్లతో ఏడాది కాలం నుంచి గ్రానైట్ వ్యాపారులు బెంబేలెత్తిపోయారు. ప్రస్తుతం సదరు నేతను అక్కడ నుంచి తప్పిస్తున్నారన్న వార్తతో వారంతా ఊపిరి పీల్చుకుంటున్నారు. ఆ నేత చర్యలతో చతికలబడిపోయామని మళ్లీ ఇప్పుడు కాలూచెయ్యి కూడదీసుకుని వ్యాపారాన్ని బతికించుకోవాల్సిన అవసరం ఉందని చెప్పడం కొసమెరుపు. వీరితో పాటు అక్కడ పనిచేస్తున్న యంత్రాంగం సైతం ఇన్నిరోజులూ తీవ్ర ఒత్తిడికి గురయ్యామని ఇకపై ఆ బాధ ఉండదని చెప్పడం సదరు నేత ఆగడాలకు అడ్డం పడుతోంది.

పర్చూరు వైసీపీ ఇన్‌చార్జి బాలాజీ..!

- శుక్రవారం సీఎం జగన్‌ను కలవనున్న బాలాజీ
- ఆ రోజే అధికారికంగా ప్రకటన వెలువడే అవకాశం

చీరాల, ఫిబ్రవరి 13: వైసీపీ పర్చూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా యడం బాలాజీ పేరు ఖరారైనట్లు తెలిసింది. ప్రస్తుతం అమెరికాలో ఉన్న బాలాజీ అక్కడినుంచి వచ్చి శుక్రవారం సీఎం జగన్‌తో భేటీ కానున్నట్లు తెలిసింది. అందుకు సంబంధించి వైసీపీ ముఖ్య నాయకులు బాలాజీతో మాట్లాడినట్లు విశ్వసనీయ సమాచారం. వైసీపీ పర్చూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ప్రస్తుతం కొనసాగుతున్న చీరాల మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ ఆ నియోజకవర్గం నుంచి పోటీ చేయనని కాడికిందపడేసిన విషయం తెలిసిందే. అంతకంటే ముందుగానే అక్కడ కాపు సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని అభ్యర్థిగా నిలపాలనేది సీఎం జగన్ నిర్ణయంగా ప్రచారం జరిగింది. ఈ క్రమంలో చీరాలకు చెందిన ఎన్‌ఆర్ఐ బాలాజీ పేరును అధిష్టానం పరిగణలోకి తీసుకున్నట్లు తెలిసింది. బాలాజీ గతంలో చీరాల నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి పోటీచేసి ఓటమి చవిచూశారు. తరువాత టీడీపీలో చేరి చీరాల నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా పనిచేశారు. ఆ తరువాత ఎం.ఎం కొండయ్య టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ క్రమంలో బాలాజీ స్తబ్దుగా ఉన్నారు. అయితే పార్టీ ని వీడలేదు. తాజాగా బాలాజీకి వైసీపీ నుంచి ఆహ్వానం అందినట్లు తెలిసింది.



తుళ్లూరు రైతు ధర్నా శిబిరంలో బిల్డ్ అమరావతి, జై ఆంధ్రప్రదేశ్ అంటూ నినాదాలు చేస్తున్న మహిళలు, రైతులు

నాలుగున్నరేళ్లు నయవంచన పాలన

● 1519వ రోజుకు చేరిన రాజధాని రైతుల ఆందోళనలు

తుళ్లూరు, ఫిబ్రవరి 13: రాష్ట్ర ప్రజలు సీఎం జగన్‌రెడ్డిని నమ్మే పరిస్థితిలో లేరని రాజధాని అమరావతి నిర్మాణానికి 33వేల ఎకరాలు భూములు త్యాగం చేసిన రైతులు అన్నారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు, నిరసన దీక్షలు మంగళవారం నాటికి 1519వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుంచి వారు మాట్లాడుతూ, అధికారం చేపట్టబోయేముందు అమరావతిని బ్రహ్మాండంగా కడతామని చెప్పావు.. ఎక్కడ, ఏదీ అని ప్రశ్నించారు. పోలవరం 2022 నాటికి పూర్తి చేస్తానని అన్నావు.. ఎక్కడ..? ప్రత్యేక హోదా తెచ్చి రాష్ట్రంలోని మూడు ప్రాంతాలను అభివృద్ధి చేస్తానని అన్నావు.. ఏదీ.. ఎక్కడ.. ఇంకెప్పుడూ? అంటూ ప్రశ్నించారు. నాలుగున్నర ఏళ్లుగా నయవంచనతో పరిపాలన చేశావు.. అభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్‌ను ఇరవై సంవత్సరాలు వెనక్కి నెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ స్వలాభం కోసం కక్షతో అమరావతిని మూడుముక్కల ఆటతో నిర్వీర్యం చేశారని ఆరోపించారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. తుళ్లూరు, వెంకటపాలెం, మందడం, వెలగపూడి, అనంతవరం, నెక్కల్లు, తదితర రాజధాని గ్రామాల్లో ఆందోళనలు కొనసాగాయి.

ఐదేళ్లుగా రాష్ట్రంలో అరాచక పాలన

● శాసనమండలి మాజీ చైర్మన్ షరీఫ్

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 13: ఐదేళ్లుగా ఏపీలో అరాచకపాలన సాగుతోందని, ఒక్కచాన్స్ అంటూ మాయమాటలు చెప్పి మన ఓట్లు గుంజేసుకున్న జగన్ మైనారిటీలను దగా చేశాడని శాసనమండలి మాజీ చైర్మన్ అహ్మద్ షరీఫ్ అన్నారు. మంగళవారం రాత్రి పిడుగురాళ్లలో మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గురజాల నియోజకవర్గస్థాయి మైనారిటీల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో షరీఫ్ మాట్లాడుతూ 100 రూపాయలకు బటన్ నొక్కి వెయ్యిరూపాయలు లాగేస్తున్న వైసీపీ ప్రభుత్వానికి రోజులు దగ్గరలో పడ్డాయన్నారు. గురజాల నియోజకవర్గంలో ముస్లింలపై దాడులు జరిపిన ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డికి ఓటు వేయొద్దన్నారు. పల్నాడు ప్రాంతానికి గుండెకాయ లాంటి యరపతినేని ముస్లిం మైనారిటీలకు అండగా వుండటం మీ అందరి అదృష్టం. పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ షేక్ నాగుల్‌మీరా మాట్లాడుతూ వైసీపీ హయాంలో ముస్లిం మైనారిటీలకు ఎంత ఖర్చు చేశారో శ్వేతపత్రం విడుదలచేయాలని డిమాండ్ చేశారు. యరపతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చాక గురజాల నియోజకవర్గంలో మైనారిటీలపై ఎన్నో దాడులు, అత్యాచారాలు, హత్యలు జరిగాయని గుర్తుచేశారు. ఐదేళ్లలో నియోజకవర్గంలో ఏ మైనారిటీ కుటుంబానికైనా, హజ్‌యాత్రకు వెళ్లే వారికెవరికైనా రూ.5 వేలు కాసు మహేష్‌రెడ్డి అందించాడా? అలా వుంటే వారి పేరు చెప్పాలన్నారు. గురజాలలో అవినీతి సంపాదనకు అలవాటుపడిన కాసును ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. రేపటి ఎన్నికల్లో ఏడవ సారి గురజాల నుంచే పోటీ చేయనున్నట్లు యరపతినేని స్పష్టం చేశారు. మైనారిటీలకు తానెప్పుడూ అండగా వుంటానని, పిడుగురాళ్లలో ఓ మైనారిటీ కుటుంబంలో కుమారులు ఇద్దరు చనిపోగా, ఆ కుటుంబానికి పెద్దబిడ్డగా వుంటానని ఇచ్చిన మాట ప్రకారం రూ.2 లక్షలు అందించి ఆ తల్లికి పాదాభివందనం చేసిన విషయాన్ని యరపతినేని గుర్తుచేశారు. ఈ సమావేశంలో జనసేన నాయకులు నాయబ్ కమాల్, ఎండీ నజీర్, నసీర్ అహ్మద్, బాబావలి, అమీర్‌అలితో పాటు తదితర నాయకులు పాల్గొన్నారు.



ముస్లిం మైనారిటీ ఆత్మీయ సదస్సులో మాట్లాడుతున్న శాసనమండలి మాజీ చైర్మన్ అహ్మద్ షరీఫ్, పక్కన మాజీ ఎమ్మెల్యే యరపతినేని తదితరులు



శాసనమండలి మాజీ చైర్మన్ షరీఫ్, మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావులను గజమాలతో సత్కరిస్తున్న మైనారిటీ సోదరులు

చిలకలూరిపేటలో ప్రత్తిపాటి చాయ్‌పే చర్చా



టీ దుకాణం వద్ద మాజీ మంత్రి ప్రత్తిపాటి మాటా మంతి

చిలకలూరిపేట అర్బన్, ఫిబ్రవరి 13: ప్రచారమంటే తాము చెప్పేదే కాదు, ప్రజలు చెప్పేది.. వారి కష్టాలు వినటం.. వారి మనిషిగా మేమున్నాం అన్న భరోసా కల్పించటం అని మాజీ మంత్రి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. పార్టీ తరుపున ప్రచారంలో భాగంగా పట్టణంలో తొలిసారి చాయ్‌పే చర్చా తరహాలో ఓ టీస్టాల్ వద్ద ఆగి స్థానికులతో మమేకమయ్యారు. బాబు షూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమానికి వెళ్తున్న ప్రత్తిపాటి సీఆర్ కాలనీలో దోస్తి కేఫ్ వద్ద ఆగి స్థానికులతో చర్చించారు. టీ విక్రయ దారులతో మాట్లాడి వారి అభిప్రాయాలు, అనుభవాలు రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన కూటమి ప్రభుత్వం ఏర్పాటు తరువాత ప్రజలు ఏం ఆశిస్తున్నారో వారిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ భారంగా మారిన నిత్యావసరాల ధరలు, ప్రభుత్వ పనులు, కరెంటు బిల్లులు భారంగా మారాయని ప్రత్తిపాటి వద్ద వాపోయారు. మరో రెండు నెలల్లో వాటన్నింటిని నుంచి ప్రజలకు విముక్తి లభిస్తుందని, సైకో సీఎం పీడ వదిలిపోతుందని ప్రత్తిపాటి తెలిపారు.

భారీ స్థాయిలో నగదు, బంగారం స్వాధీనం

నరసరావుపేట లీగల్, ఫిబ్రవరి 13: నరసరావుపేట సమీపంలో కాచిగూడ - గుంటూరు రైల్లో ఇరువురు వ్యక్తుల వద్ద నుంచి మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో రూ.11.14లక్షల నగదు, 391 గ్రాముల బంగారు ఆభరణా లను స్వాధీనం చేసుకున్నట్టు నరసరావుపేట రైల్వే ఎస్‌ఐ సుబ్బారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల దృష్ట్యా ఉన్నతాధికా రుల సూచనల మేరకు అక్రమ ధనం తరలించటాన్ని అరికట్టడానికి తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా మంగళవారం కాచిగూడ - గుంటూ రు రైల్లో వినుకొండ నుంచి నరసరావుపేట వరకు తనిఖీలు నిర్వహిస్తుండగా విజయవాడకు చెందిన దోసపాటి మోహనరావు, గుజరాత్‌కు చెందిన ఆనంద్ కుమార్‌లు నగదు, బంగారాన్ని భారీస్థాయిలో కలిగి ఉన్నారన్నారు. వాటిని స్వాధీనం చేసుకొని ప్రశ్నించగా సరైన ఆధారాలు చూపలేక పోయారన్నారు. వీరిరువురు విజయవాడలోని శాంతి జ్యూవెలర్స్‌లో పని చేస్తున్నారని, బంగారు వస్తువులను వినుకొండలో అందజేసి నగదును తీసుకువెళ్తున్నట్టు తెలిపారన్నా రు. నిందితులను అరెస్టు చేశామని, స్వాధీనం చేసుకున్న బంగారాన్ని, నగదును సంబంధిత అధికారులకు అందజేయనున్నట్టు వారు తెలిపారు.

నడికుడి - గురజాల మధ్యన ఆర్‌యూబీ మూసివేత

గుంటూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): నడికుడి - గురజాల సెక్షన్ మధ్యన ఉన్న 87ఏ రోడ్డు అండర్ బ్రిడ్జి(ఆర్‌యూబీ)ని 45 రోజుల పాటు మూసి వేయనున్నట్లు గుంటూరు రైల్వే డీఆర్‌ఎం ఎం రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15వ తేదీ నుంచి మార్చి 31వ తేదీ వరకు బ్రిడ్జి మూసివేసి ఉంటుందన్నారు. నడికుడి రైల్వేస్టేషన్‌లో కంటైనర్ ట్రాఫిక్ నిర్వహణ నిమిత్తం అదనపు లూప్‌లైన్ల నిర్మాణం కోసం ఆర్‌యూబీ 87ఏని పొడిగించాల్సి ఉందన్నారు. ఈ ఆర్‌యూబీ దాచేపల్లి-గోగులపాడు గ్రామాలను కలుపుతుందన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు దాచేపల్లి మీదగా మాచర్ల రహదారికి చేరుకోవచ్చని సూచించారు.

5వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

తాడికొండ, ఫిబ్రవరి 13: తాడికొండలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల సాంఘిక సంక్షేమ పాఠశాల(బాలుర)లో 5వ తరగతిలో చేరు విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.మరియదాసు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి 80 సీట్లు ఉన్నాయన్నారు. ఎస్సీ-60, బీసీ-సీ 10, ఎస్టీ-5, బీసీ-4, ఓసీ-1 సీట్లు ఉన్నట్లు తెలిపారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో నివసించేవారు ఈనెల 23వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 9948138872 నెంబరులో సంప్రదించాలన్నారు.

గుంటూరు మిర్చియార్డులో ధరలు ఇలా...

గుంటూరు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 1,49,013 టిక్కీల మిర్చి విక్రయానికి రాగా అందులో 1,37,129 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్‌కమిటీ జాయింట్ డైరెక్టర్ కె.శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డులో 1,01,807టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			సూపర్ 10	13500	17300
334	8000	20500	నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
నెంబరు. 5	9000	20000	తేజ	8000	21500
273	13500	20500	బ్యాడిగి	10000	21000
341	10000	21500	దేవనూరుడీలక్స్	11000	20000
4884	13000	18000	తెల్లకాయలు	5500	12000

దొరక్కుండా.. దాచేశారు..

- ● నిన్నటి వరకు యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా
- ● ఎన్జీటీ ఆదేశాల మేరకు ఇసుక రీచ్‌లను పరిశీలించిన కలెక్టర్ శివశంకర్
- ● ముందస్తు సమాచారంతో క్వారీయింగ్ నిలిపివేత
- ● ఎక్స్‌కవేటర్లను దాచేశారు..
- ● ఇసుక అక్రమ క్వారీయింగ్ అడ్డుకోవాలని అధికారులకు కలెక్టర్ ఆదేశం

అమరావతి, అచ్చంపేట, ఫిబ్రవరి 13: ఎన్జీటీ ఆదేశాల మేరకు కలెక్టర్ శివశంకర్ లోతేటి మంగళవారం పెదకూరపాడు నియోజకవర్గంలోని మల్లాది, కోనూరు గ్రామాల్లో ఉన్న ఇసుకరీచ్‌లను మైనింగ్, పొల్యూషన్, రెవిన్యూ అధికారులతో కలసి పరిశీలించారు. నదీతీరం వెంబడి ఇసుక రీచ్‌లలో జరుగుతున్న ఇసుక అక్రమ క్వారీయింగ్, రవాణాకు సంబంధించి వివరాలను సేకరించి రిపోర్టు ఇవ్వాలని ఎన్జీటీ ఇచ్చిన ఆదేశాల మేరకు కలెక్టర్ రీచ్‌లను సందర్శించారు. కలెక్టర్ రీచ్‌ల పరిశీలనకు వచ్చిన సమయంలో ఇసుక అక్రమార్కులు ఎక్స్‌వేటర్‌లను సమీపంలోని పొలాల్లో దాచి క్వారీయింగ్‌ను నిలుపుదల చేశారు. మైనింగ్ అధికారి ఇసుక క్వారీయింగ్‌కు అనుమతులు లేవని ఎక్కడా ఇసుక అక్రమ రవాణా జరగడంలేదని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. రీచ్‌లో ఇసుక వాహనాలు తిరిగినట్లు కనిపించడం, నిత్యం ఇసుకక్వారీయింగ్ జరుగుతుందని స్థానికులు కలెక్టర్ దృష్టికి తీసుకురావడంతో కలెక్టర్ స్పందించారు. మండల అధికారులు తమ పరిధిలో క్వారీయింగ్‌కు పాల్పడేవారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట మైనింగ్ ఏడీ నాగిణి, పొల్యూషన్ కంట్రోల్ అధికారితో పాటు ఆర్డీవో మురళీకృష్ణ, తహసీల్దార్ రమణారావు, ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో జి.రాణి, కుసుమకుమారి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



మల్లాది రీచ్‌ని పరిశీలిస్తున్న కలెక్టర్ శివశంకర్

ముందస్తు సమాచారంతో...

ఇసుక రీచ్‌లను పరిశీలించేందుకు జిల్లా అధికారులు వస్తున్న సమాచారం అక్రమార్కులకు తెలియడంతో మండలంలోని వైకుంఠపురం, మల్లాది గ్రామాల్లో జరుగుతున్న ఇసుక క్వారీయింగ్, అక్రమరవాణా మంగళవారం నుంచి నిలిచిపోయింది. నిత్యం వందలసంఖ్యలో భారీవాహనాల్లో ఇసుక తరలిస్తూ లక్షలాది రూపాయలు సొమ్ము చేసుకుంటున్నా మండలస్థాయి అధికారులు అటువైపు కన్నెత్తికూడా చూడలేదు. దొంగబిల్లులతో ఇసుక ఓవర్‌లోడుతో వెళుతున్న వాహనాలపై పర్యవేక్షణ కూడా లేదు. అక్రమ క్వారీయింగ్ అడ్డుకుంటే అధికారపార్టీ నాయకుల నుంచి బెదిరింపులకు గురికావాల్సివస్తుందని మండల, గ్రామస్థాయి అధికారులు అడ్డుకునేయత్నం చేయలేదని తెలుస్తోంది. హైకోర్టు అక్రమక్వారీయింగ్‌పై సీరియస్‌గా ఉండటంతో ఇప్పటికి జిల్లా అధికారులు కళ్లుతెరిచారని స్థానికులు అంటున్నారు.

వైసీపీ ప్రచార సభగా ఆసరా చెక్కుల పంపిణీ



ఆసరా చెక్కు పంపిణీ సభలో మాట్లాడుతున్న గుంటూరు వైసీపీ ఎంపీ అభ్యర్థి ఉమ్మారెడ్డి వెంకటరమణ

పొన్నూరుటౌన్, ఫిబ్రవరి13: ఆసరా చెక్కుల పంపిణీ ప్రభుత్వ కార్యక్రమాన్ని వైసీపీ ఎన్నికల ప్రచార సభగా మార్చడం పట్ల తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. పొన్నూరు పట్టణంలోని ఓ కల్యాణ మండపంలో మంగళవారం వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ సభ నిర్వహించారు. ఈ వేదికపై స్థానిక ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్యతోపాటు ఆయన బావమరిది వైసీపీ గుంటూరు ఎంపీ అభ్యర్థి ఉమారెడ్డి వెంకటరమణ, వైసీపీలో కీలక పదవుల్లో ఉన్న పలువురు నాయకులు ఆసీనులై ప్రసంగించారు. వెంకటరమణ మాట్లాడుతూ గుంటూరు ఎంపీగా తనను, పొన్నూరు ఎమ్మెల్యేగా తన బావమరిది కిలారి వెంకట రోశయ్యను గెలిపించాలని మహిళలకు విజ్ఞప్తి చేస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని ఎన్నికల ప్రచార సభలా నిర్వహించారని మహిళలు మండిపడుతున్నారు. అధికారులు కూడా రాజకీయ పార్టీకి వత్తాసు పలికేలా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు.

హత్యకేసులో 12మంది నిందితుల అరెస్టు



సమావేశంలో హత్య కేసుల వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

బాపట్లరూరల్, ఫిబ్రవరి 13: పాతకక్షల నేపథ్యంలోనే గోరంట్ల వెంకటసుమంత్ హత్య జరిగినట్లు బాపట్ల డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం బాపట్ల రూరల్ పోలీసుస్టేషన్‌లో విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల ఆరోతేదీన సుమంత్‌పై వినోద్, యాసిన్ మరో 10 మంది కర్రలతో దాడి చేశారు. అనంతరం వినోద్ కత్తితో పొడిచాడు. దీంతో సుమంత్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి తల్లి సుష్మాంజలి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా 12మందిని అరెస్టు చేయటం జరిగిందన్నారు. ముద్దాయిలైన వినోద్, యాసిన్, సతీష్, అఖిల్, చిన్నవినోద్, ప్రవీణ్ బాబు, దాసు, శివసాయి, బాబు, మహేష్, అశోక్‌లను అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరిచామని డీఎస్పీ తెలిపారు. అదేవిధంగా రౌడీషీటర్లపై నిఘా ఏర్పాటు చేయటం జరిగిందని తెలిపారు. బాపట్ల సబ్ డివిజన్ పరిధిలో ఉన్న పోలీసుస్టేషన్ పరిధిలో రానున్న సార్వత్రిక ఎన్నికల సందర్భంగా డివిజన్ వ్యాప్తంగా 30యాక్ట్ పోలీసు అమలలో ఉందని తెలిపారు. సమావేశంలో ట్రైనీ డీఎస్పీ శ్రీవిద్య, బాపట్ల సర్కిల్ సీఐ హజరత్‌బాబు, బాపట్ల రూరల్ సీఐ శ్రీహరి, ఎస్‌ఐ రవిశంకర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



శంకర్‌రెడ్డి మృతదేహం

మాచర్ల, ఫిబ్రవరి 13: విద్యుత్‌షాక్‌తో రైతు మృతిచెందిన ఘటన మాచర్ల పట్టణంలో జరిగింది. పట్టణంలోని రవి స్వీట్స్‌షాపు యజమాని శంకర్‌రెడ్డి (65) మంగళవారం పట్టణ శివారులోని రామప్ప ఆలయం వద్ద ఉన్న తన పొలానికి నీరుపెట్టేందుకు వెళ్లారు. మోటారు స్విచ్ ఆన్ చేస్తుండగా ప్రమాదవశాత్తూ విద్యుత్ షాక్ తగిలి కుప్పకూలిపోయారు. పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇసుక అక్రమాలపై వైసీపీలోనే తిరుగుబాటు



పెదకొండూరులో రీచ్‌ని పరిశీలిస్తున్న తహసీల్దార్ కె.రవీంద్ర, ఎస్సై ప్రతాప్

దుగ్గిరాల, ఫిబ్రవరి13: గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలంలో ఇసుక అక్రమంగా తరలివెళుతుందంటూ వైసీపీ నాయకులే అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. పెదకొండూరు రీచ్ నుంచి పెద్దఎత్తున్న అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారంటూ సాక్షాత్తూ జడ్పీటీసీ మేకతోటి అరుణకుమారి, గ్రామ ఎంపీటీసీ సుమన్‌తో కలిసి మంగళవారం స్థానిక తహసీల్దార్ కె.రవిబాబు, ఎస్‌ఐ సీహెచ్ ప్రతాప్‌లకు ఫిర్యాదు చేశారు. మైనింగ్ డీడీ దృష్టికి తీసుకెళ్లగా తమశాఖ నుంచి ఎటువంటి అనుమతులు లేవని చెప్పారని జడ్పీటీసీ అరుణ అన్నారు. లారీల్లో భారీగా తరలిస్తున్నారని, రోడ్లుకూడా దెబ్బతిని పోతున్నాయని తక్షణమే చర్యలు తీసుకోకుంటే బుధవారం నుంచి గ్రామస్తులతో కలిసి అక్రమ క్వారీయింగ్‌ను అడ్డుకుంటామని హెచ్చరించారు. దీంతో తహసీల్దార్ రవిబాబు, ఎస్‌ఐతో కలిసి రీచ్‌వద్దకు వెళ్లి పరిస్థితిని పరిశీలించారు. అక్రమ మైనింగ్‌పై సొంత పార్టీనేతలే ఫిర్యాదు చేయడం పట్ల జిల్లావ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

ఐఐటీ జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో విజ్ఞాన విద్యార్థుల ప్రభంజనం



విద్యార్థులతో శ్రీకూర్మనాథ్ తదితరులు

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 13: ఐఐటీ జేఈఈ మెయిన్స్ పరీక్షలో విజ్ఞాన్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని విద్యాసంస్థల సమన్వయకర్త జి.శ్రీకూర్మనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష ఫలితాల్లో తమ కళాశాలకు చెందిన ఐ.హసీత్(99.67), ఎం.స్నేహ(99.46), రోహన్(98.48), కే లీలావతి (98.30), బీ యోగవిజయ్‌కుమార్(98.07), ఎస్.వెంకటగాయత్రి (96.32), ఏ దీపిక(95.78), టీ సంజయ్‌తేజ(94.71), పీ గౌతమ్(94.61), ఎం.నాగసాయి ప్రకాష్(93.66), వీ అభిరామ్(93.57), నాగ మానస(93.56), ఏ చంద్రిక(93.07), ఏ థాఫిల్ (93.50), జీ వైశాలి(92.76), సీ రేవంత్(92.11), జీ పుల్లారెడ్డి(92.05), వీ నందిని(91.60), వై.నాగకార్తికేయ(90.96) పర్సంటేజ్ సాధించారని పేర్కొన్నారు. విద్యార్థులను విజ్ఞాన్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ లావు రత్తయ్య, వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు, అధ్యాపకసిబ్బంది అభినందనలు తెలిపారు.

డీఏలను రికవరీ చేయడం చరిత్రలో తొలిసారి..

● వీఆర్‌ఏ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే ఉమామహేశ్వరరావు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 13: చరిత్రలో తొలిసారిగా డీఏ రికవరీ పేరుతో వీఆర్‌ఏల నుంచి పెద్దఎత్తున వసూలుచేసిన ఘనత జగన్ ప్రభుత్వానికే దక్కుతుందని ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే ఉమామహేశ్వరరావు ఎద్దేవా చేశారు. మంగళవారం స్థానిక పాత గుంటూరులో సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఆ సంఘ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2018 నుంచి 2024 జనవరి నాటికి ఒక్కో వీఆర్‌ఏ రూ.21,900 డీఏ రూపంలో కోల్పోయాడని వివరించారు. ఇన్ని ప్రభుత్వాలు మారినా వీఆర్‌ఏలను ఇంత దారుణంగా దెబ్బతీసిన ప్రభుత్వం లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా వీఆర్‌ఏలందరిని మేల్కొల్పి పోరుబాట పట్టకపోతే వ్యవస్థకే నష్టంవచ్చే ప్రమాదం ఉందన్నారు. నామినీలను వీఆర్‌ఏలుగా గుర్తించడం, అర్హులైన వారందరికి పదోన్నతులు, ఇతర డిమాండ్ల సాధనకై ఈ నెల 18, 19, 20 తేదీలలో తలపెట్టిన రిలేదీక్షలలో వీఆర్‌ఏలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వై నేతాజీ, బి.లక్ష్మణరావు, షేక్ నాగులమీరా, రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉందని..

● కన్న కూతుర్ని ప్రియుడితో కలిసి చంపిన తల్లి

తాడికొండ, ఫిబ్రవరి 13: వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉందని తల్లి తన ప్రియుడితో కలిసి కన్న కూతుర్ని(6) కొట్టిచంపిన సంఘటన తాడికొండ మండలం బండారుపల్లి గ్రామంలో మంగళవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కర్నూలు జిల్లా ఆలూరుకు చెందిన కొణతాల సిద్దార్థ హైదరాబాద్‌లో కూలీ పనుల చేసుకొని జీవనం సాగిస్తున్నాడు. హైదరాబాద్‌లోని లాల్‌గూడకు చెందిన జనగాల స్వప్నకు సిద్దార్థతో పరిచయం ఏర్పడింది. స్వప్న ఓ బట్టల దుకాణంలో పనిచేస్తోంది. అమెకు భర్త, కుమార్తె(6) ఉన్నారు. సిద్దార్థ, స్వప్నల మధ్య కొంతకాలంగా వివాహేతర సంబంధం నడుస్తోంది. దీంతో ఇద్దరు కలిసి మూడు నెలల క్రితం హైదరాబాద్ నుంచి పారిపోయి అక్కడక్కడ తలదాచుకుంటున్నారు. 25 రోజుల క్రితం తాడికొండ మండలం బండారుపల్లి గ్రామానికి వచ్చారు. ఇదే గ్రామంలో గుడారం వేసుకుని మిరపకోత పనులకు వెళ్తున్నారు. ఈ క్రమంలో వారి వివాహేతర సంబంధానికి కుమార్తె అడ్డుగా ఉందని భావించి ఐదు రోజుల క్రితం చిన్నారిని కొట్టి చంపేశారు. పక్కనే ఉన్న రైల్వే ట్రాక్ వద్ద మృతదేహాన్ని పెట్రోల్ పోసి కాల్చివేశారు. అప్పటినుంచి ఇద్దరు పారిపోయారు. రైల్వేట్రాక్ వద్ద మృతదేహాన్ని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వటంతో సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ప్రభాకర్ పేర్కొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.36 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	138, 147,158
చికెన్ విత్ స్కిన్	264.00
చికెన్ స్కిన్ లెస్	274.00

పత్రికా ప్రకటన

నా క్లయింటు అయిన **నూనె నిత్యానందం గారి కుమారుడు నూనె కార్తీక్,** డోర్ నెం. 4-2-91/5బి, ఫ్లాట్ నెం. 207, గాయత్రి సదన్ అపార్టుమెంట్, 1వ లైను, శ్రీనివాస కాలనీ, బాపట్ల టౌన్, బాపట్ల జిల్లాకు చెందిన స్థిరనివాసి. సదరు విక్రయ దస్తావేజు **డాక్యుమెంట్ నెం. 1061/1985, తేది : 30.04.1985** సాగి సుబ్బరాజు గారి భార్య సాగి ప్రభావతి వారి దస్తావేజు పోయినట్లుగా చెరుకుపల్లి పోలీస్ స్టేషన్ వారి వద్ద నుండి ది. 02.08.2011వ తేదీన పోలీస్ సర్టిఫికెట్ పొందియున్నారు. సదరు దస్తావేజు **డాక్యుమెంట్ నెం. 1061/1985, తేది : 30.04.1985** పై ఎవ్వరికైన ఎటువంటి అభ్యంతరములు ఉన్న యెడల ఈ రోజు నుంచి మాకు ఏడు రోజుల లోపు తమ అభ్యంతరములను వ్రాతపూర్వకంగా తగు ఆధారాలతో మాకు తెలుపగలరు. లేనియెడల ఎవ్వరికి ఎటువంటి అభ్యంతరములు లేవని భావించగలము. తదుపరి వచ్చు అభ్యంతరములకు మా క్లయింటు బాధ్యుడు కాడని తెలియచేయడమైనది.

బాపట్ల : తేది : **13.02.2024**

భీమ లీలా క్రిష్ణ, అడ్వకేట్ & నోటరీ, 3వ లైను, పటేల్ నగర్, బాపట్ల జిల్లా, సెల్ : **9440084690**

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

అంతర్జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్‌కు బాపట్ల హెడ్‌కానిస్టేబుల్

● అభినందించిన ఎస్పీ వకుల్ జిందాల్



నాగరాజుకు ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

బాపట్ల, ఫిబ్రవరి 13 : జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలలో సత్తా చాటిన బాపట్లజిల్లా హెడ్ కానిస్టేబుల్ సీహెచ్ నాగరాజు ఆస్ట్రేలియాలో జరగనున్న అంతర్జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ వకుల్ జిందాల్ మంగళవారం నాగరాజును అభినందించి ప్రశంసాపత్రం అందజేశారు. ఈనెల 8 నుంచి 11వ తేదీ వరకు హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో 5వ నేషనల్ మాస్టర్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. ఈపోటీలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి 40 సంవత్సరాలు పైబడిన విభాగంలో నాగరాజు పాల్గొని పోల్‌వాల్ట్‌లో స్వర్ణం, షార్ట్‌పుట్‌లో రజిత పతకాలు సాధించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన నాగరాజును అంతర్జాతీయ పోటీలకు ఎంపిక చేశారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో 24 రాష్ట్రాలు నుంచి క్రీడాకారులు పాల్గొన్నారని అందులో కానిస్టేబుల్ నాగరాజు పతకాలు సాధించి అంతర్జాతీయ పోటీలకు ఎంపిక కావటం అభినందనీయమన్నారు. అక్కడ కూడా ప్రతిభకనబరచాలని ఆకాంక్షించారు. పోలీసుసిబ్బంది నాగరాజును స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ వి.మల్లిఖార్జున్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ కళాశాలలో పీసీబీడిజైన్, ఫ్యాబ్రికేషన్ శిక్షణ ప్రారంభం

బాపట్ల, ఫిబ్రవరి 13 : బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగం ఆధ్వర్యంలో హాండ్స్ ఆన్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ మంగళవారం బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు ముప్పలనేని శ్రీనివాసరావు, మానం నాగేశ్వరరావు ప్రారంభించారు. పీసీబీ డిజైన్, ఫ్యాబ్రికేషన్‌ను ద్విగిజయంగా నిర్వహించారు. కార్యక్రమానికి రిసోర్స్‌పర్సన్‌లుగా భూమిత్ర టెక్నాలజీస్ తిరుపతికి చెందిన ఎస్.కేధార్‌నాథ్ పాల్గొన్నారు. భవిష్యత్తులో పీసీబీడిజైన్ ఆవశ్యకతను, దానివలన ఉపయోగాలను క్షుణ్ణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఎడ్యుకేషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు రామ్మోహనరావు, కరస్పాండెంట్ హరిపద్మప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్.నజీర్, ట్రిపుల్‌ఈ విభాగాధిపతి డాక్టర్ ఎస్.రమాదేవి, భోధన, బోధనేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు ముప్పలనేని శ్రీనివాసరావు, మానం నాగేశ్వరరావు తదితరులు

మహిళలకు పేరంటాల పెళ్ళి నలుగు పాటల పోటీలు

బాపట్ల, ఫిబ్రవరి 13 : నానాటికి కనుమరుగవుతున్న పేరంటాల పెళ్ళి నలుగు పాటలను ముందు తరాల వారికి అందించే విధంగా మాలమహానభ పీపుల్స్ రిపబ్లికన్ పార్టీ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సతీమణి రమాబాయ్ 126వ జయంతి సందర్భంగా బాపట్ల అంబేద్కర్‌భవన్‌లో నిర్వహించిన ఈ పోటీలకు 14 గ్రామాలు నుంచి టీమ్‌లుగా పేరంటాలు వచ్చి పాటలు పాడారు. పోటీలో పాల్గొన్న ప్రతి టీమ్‌కు రూ.1500 అందజేశారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. గణపవరం, పేరలిపాడు, మూలపాలెం, చింతావారిపాలెం, నరసాయపాలెం, హైదర్‌పేట, పేరంటాలు విశిష్ట ప్రతిభకనబరిచారు. ఈ కార్యక్రమంలో మాలమహానభ వ్యవస్థాపకులు, పీపుల్స్ రిపబ్లికన్ పార్టీ అధ్యక్షులు మల్లెల వెంకట్రావు, జి.లజపతిరాయ్, యండ్రపాటి అశోక్, నక్కాభాను, దగ్గుమల్లి కిరణ్‌కుమార్, అడే బుజ్జి, గొర్రెముచ్చు వందనం, చల్లాపలి కోటేశ్వరరావు, యర్రా కోటయ్య, గుదే రాజారావు తదితరులు పాల్గొన్నారు. బహుమతులను ఎంకెఎం సుసొసైటీవారు అందజేశారు.



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

వివిధ అంశాలపై అధికారుల సమావేశం

పిట్టలవానిపాలెం,ఫిబ్రవరి 13 : మండలంలోని 12 సచివాలయాల వివిధశాఖల ఉద్యోగులు, గ్రామపంచాయతీ, సచివాలయాల కార్యదర్శులు, వెల్ఫేర్ ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు, ఏఎన్ఎంలు తదితరశాఖల అధికారులతో హౌసింగ్ రిజిస్ట్రేషన్‌లు, ఆరోగ్యశ్రీనూతన కార్డుల పంపిణీ, కులగణన కార్యక్రమాలపై సంబంధితశాఖాధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. మండల ప్రజాపరిషత్ సమావేశపు హాలులో జరిగిన సమావేశానికి ఎంపిడివో ఎం.వి.రమణమూర్తి అధ్యక్షత వహించారు. వివిధ శాఖల అధికారులు, పలువురు ప్రత్యేకాధికారులు పాల్గొని వారికి దిశ, నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ కె.పద్మజ, పంచాయతీల కార్యదర్శులు, సచివాలయాల ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ గంగా గౌరి సమేత బదరి కేదారేశ్వరిస్వామి శివాలయంలో పూజలు

కర్లపాలెం, ఫిబ్రవరి 13 : కర్లపాలెం అగ్రహారంలోని శ్రీ గంగా గౌరి సమేత బదరి కేదారేశ్వరిస్వామి శివాలయంలో మాల ధరించిన స్వాములకు చద్ది కార్యక్రమం మంగళవారం 15వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఉదయం గణపతి పూజ, సుబ్రహ్మణ్యస్వామి, శివపార్వతులకు అష్టోత్తర శతనామావలి పూజలు పూజారి వాసుదేవశాస్త్రి ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రత్యేక పూజలు, భజనలు, అభిషేకాలు, చద్దికార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలను కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

మురుగు కాలువల్లో పూడికతీత

భట్టిప్రోలు, ఫిబ్రవరి 13 : 'ప్రమాదంలో ప్రజారోగ్యం, అధ్వాన పారిశుధ్యం'తో విజృంభిస్తున్న దోమలు శీర్షికన మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. అధ్వానంగా ఉన్న డ్రెయినేజీలు, ముందుకు కదలని మురుగుపై పంచాయితీ సిబ్బందిలో కదలిక వచ్చింది. స్థానిక జీడీసీసీ బ్యాంక్ వద్ద నెలల తరబడి సిమెంటు రోడ్డుపై నిలిచి ఉన్న నీటిని తొలగించి మంగళవారం పంచాయతీ పారిశుధ్య కార్మికులు మురుగు కాలువల్లో పూడికలు తీశారు. అదే విధంగా గ్రామంలోని పలు వార్డుల్లో డ్రెయినేజీల్లో పూడికతీత పనులు చేపట్టారు. జీడీసీసీ బ్యాంక్ వద్ద పూడికతీత చేపట్టి నీరు నిలబడకుండా చర్యలు చేపట్టడంతో స్థానిక ప్రజలు, బ్యాంక్ ఖాతాదారులు సంతోషం వ్యక్తం చేశారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



స్థానిక జీడీసీసీ బ్యాంక్ వద్ద మురుగు కాలువలో పూడిక తీస్తున్న పారిశుధ్య కార్మికులు

ఎమ్మెల్యే కోనపై విమర్శలు సరికాదు

● వైసీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు చల్లా రామయ్య

బాపట్ల, ఫిబ్రవరి 13 : ఎమ్మెల్యే కోన రఘుపతిపై విమర్శలు చేయటం సరికాదని వైసీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు చల్లా రామయ్య అన్నారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో మంగళవారం పార్టీశ్రేణులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యేను ఇష్టానుసారంగా దూషిస్తే సహించేదిలేదన్నారు. బాపట్ల అభివృద్ధిలో విశేష కృషి చేస్తున్న కోన రఘుపతిపై అసత్య ఆరోపణలు,విమర్శలు సిగ్గుచేటు అన్నారు. కార్యక్రమంలో నాయకులు షేక్.సుభానీ, టి.వెంకటేశ్వరరావు, కాగిత రవి, ఆకురాతి విష్ణుమూర్తి, కృష్ణ, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

తవ్వారు.. వదిలేశారు

● ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని అధికారులు



గడియార స్తంభం సెంటర్‌లో పైపులైన్ మరమ్మతుల నిమిత్తం తవ్విన గుంత

బాపట్ల, ఫిబ్రవరి 13 : నిత్యం ప్రయాణీకుల రాకపోకలతో రద్దీగా ఉండే బాపట్ల గడియారస్తంభం సెంటర్‌లో నడిరోడ్డుపై గుంత తవ్వి వదిలేశారు. పైపులైన్ మరమ్మతుల నిమిత్తం వారం రోజుల క్రితం పెద్ద ఎత్తున తవ్విన ఈ గుంత వల్ల వాహనచోదకులు, పాదచారులు ఇక్కట్లను ఎదుర్కొంటున్నారు. మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యంగా తవ్వివదిలేస్తే ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేవిధంగా వాహనాలను మరో రోడ్డుకు మళ్ళించకుండా పోలీసు అధికారులు పట్టనట్లు ఉన్నారు. దీనివల్ల వాహనాలు ఎదురెదురు వచ్చినప్పుడు గంటల కొద్ది నిలిచిపోవటం, ద్విచక్ర వాహనచోదకులు, పాదచారులు వాహనాలు వెళ్ళే వరకు వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనికితోడు గుంతకు మరోవైపు పెద్ద ఫ్లెక్సీలు పెట్టారు. దీని వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. హైవే నిర్మాణ పనుల సమయంలో రోడ్డు విస్తరించేందుకు తవ్విన గుంత వల్ల తాగునీటి పైపులైన్ మరమ్మతులకు గురైంది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఇక్కడ 15 సార్లు గుంత తవ్వి మరమ్మతులు చేయటం, మరలా సమస్య రావటం పరిపాటిగా మారింది. శాశ్వత ప్రాతిపదికన మున్సిపల్ అధికారులు దీనికి మరమ్మతులు చేయలేకపోతున్నారు. నడిరోడ్డుపై పెద్ద ఎత్తున తవ్విన ఇసుక గుట్టగా పోయటం, పక్కనే మెటల్ పరిచి ఉండటంతో వాహనాలు అదుపు తప్పుతున్నాయి. సూర్యలంక వైపు నుంచి వచ్చే వాహనాలను మరో రోడ్డు నుంచి మళ్ళిస్తే కొంత ట్రాఫిక్ సమస్య తగ్గి ఇక్కడ ప్రమాదాలు జరగకుండా ఉంటుంది. అదేవిధంగా జీబీసీరోడ్డు నుంచి వచ్చే వాహనాలు సూర్యలంకరోడ్డువైపు వెళ్ళటానికి మరొక రోడ్డును కేటాయించిన సమస్యను పరిష్కరించవచ్చు. ఏదో ఒక నిర్ణయం తీసుకోకపోవటం వల్ల తరచూ వాహనాలు ఎదురెదురు పడటం ప్రమాదాలు జరగటం పరిపాటిగా మారింది. ప్రతిరోజు ఉదయం స్కూల్‌బస్సులు వచ్చే సమయంలో అయితే ఇక్కడ పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. పోలీసు అధికారులు ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు కనుచూపు మేర ఇక్కడ కనిపించటంలేదు. ఎదురెదురు వాహనాలు వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయినప్పటికి మున్సిపల్ అధికారులు పైపులైన్ మరమ్మతులు చేసి గుంతను పూడ్చరు. హైవే కాంట్రాక్టర్ విస్తరణ పనులు పూర్తి చేయరు. పోలీసు అధికారులు ట్రాఫిక్ మళ్ళింపుకు చర్యలు తీసుకోరు. ఈవిధంగా సమన్వయ లోపంతో సమస్య తీవ్రరూపం దాల్చింది. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకొని సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలని పట్టణ ప్రజలు, వాహనచోదకులు కోరుతున్నారు.



నడిరోడ్డుపై పోసిన ఇసుకతో ఇబ్బందులు పడుతున్న వాహనచోదకులు

వైసీపీ యువజన విభాగం జిల్లా కమిటీ కార్యదర్శిగా అయ్యప్పరెడ్డి

కర్లపాలెం, ఫిబ్రవరి 13 : మండలపరిధిలోని ఏట్రవారిపాలెం గ్రామానికి చెందిన వైసీపీ యువ నాయకుడు మునగాల అయ్యప్పరెడ్డిని వైసీపీ యువజన విభాగం జిల్లా కమిటీలో కార్యదర్శిగా ఇటీవల అదిష్టానం మంగళవారం నియమించింది. అయ్యప్పరెడ్డి తన నియామకానికి కృషి చేసిన ఎమ్మెల్యే కోన రఘుపతిని వైసీపీనాయకులతో కలిసి గజమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమంలో వైసీపీ మండలాధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు, ఏఎంసీ ఛైర్మన్ దొంతి బోయన సీతారామిరెడ్డి, వైసీపీ నాయకులు ఆట్ల నాగేశ్వరరెడ్డి, ఆట్ల పెద శ్రీనివాస్‌రెడ్డి, ఏట్ర ప్రసాద్‌రెడ్డి, ఆట్ల హరిబాబురెడ్డి, జయభారత్ రెడ్డి, అంకినీడు సంతోష్, ఏట్రవారిపాలెం యువకులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కోన రఘుపతి గజమాలతో సన్మానిస్తున్న అయ్యప్పరెడ్డి తదితరులు

సాయిబాబా దేవాలయంలో గుండ్రెడ్డి దంపతుల పూజలు

బాపట్ల, ఫిబ్రవరి 13 : పట్టణంలోని కొత్తబస్టాండ్‌లో ఉన్న శ్రీ షిరిడిసాయిబాబా దేవాలయం 28వ ప్రతిష్ఠ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. జీఎస్ఆర్ బిల్డర్స్ అండ్ డెవలపర్స్ అధినేత గుండ్రెడ్డి శివ, అనురాధ దంపతులు పాల్గొని అఖండదీప స్థాపన, అఖండ నామసప్తాహం ప్రారంభించారు. శ్రీషిరిడిసాయిబాబా సేవాసమితి అధ్యక్షులు కె.రాజ్యలక్ష్మీ, కార్యదర్శి ఉప్పాల వీరయ్య, బొలగాని బాలకృష్ణుడు, గోవిందరావు పాల్గొన్నారు.

చీకటి జీవోను రద్దు చేయాలి : గోపాలరావు

రేపల్లె, ఫిబ్రవరి 13 : ఆంధ్రప్రదేశ్ ల్యాండ్ టైటలింగ్ చట్టాన్ని ప్రభుత్వం పునరాలోచించి తీసివేయాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కేసన గోపాలరావు అన్నారు. మంగళవారానికి న్యాయవాదులు చేస్తున్న రిలే నిరాహార దీక్ష 39వరోజుకు చేరింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అసోసియేషన్ సభ్యులు సంఘీభావం తెలిపారు. దీక్షా శిబిరంలో కంచర్ల వెంకట్రావు, కలిశెట్టి శ్రీనివాసరావు, చుకోరి లక్ష్మణ్ రావు, బేతపూడి వీరయ్యలు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ టైటలింగ్ చట్టం 27/22ను రద్దు చేయకుంటే రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఉందన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు కొలుసు రామారావు, మెండు సుబ్బారావు, ఆళ్ళ సూరిబాబు, దారం సాంబశివరావు, పుప్పాల ఐజ్ పాల్గొన్నారు.

ప్రధానమంత్రి మోదీ పేదల పక్షపాతి : శివరావు

చెరుకుపల్లి, ఫిబ్రవరి 13 : ప్రధాన మంత్రి మోదీ పేద ప్రజల సంక్షేమం కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అందిస్తున్నారని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఉండ్రకొండ శివరావు అన్నారు. రాజవోలు, నడిపంల్లి గ్రామాల్లో వికసిత్ భారత్ పథకం గురించి మంగళవారం ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాంపల్లి జగన్నాథశాస్త్రి, అబ్బురి గణేష్‌బాబు, పోతురాజురెడ్డి, యేమినేని కోటేశ్వరరావు, యెండూరి ఆంజనేయులు పాల్గొన్నారు.

గ్రామీణ భారత్ బంద్‌ను విజయవంతం చేయాలి

భట్టిప్రోలు, ఫిబ్రవరి 13 : రైతాంగ కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఈనెల 16న కేంద్ర కార్మిక సంఘాలు, రైతు సంఘాలు నిర్వహించతలపెట్టిన దేశ వ్యాప్త కార్మిక సమ్మె, గ్రామీణ భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని కార్మిక సంఘాల నాయకులు గొట్టుముక్కల బాలాజీ, మురుగుడు సత్యనారాయణ, మత్రివాడ వెంకట్రావు పిలుపునిచ్చారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంల మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో బీజేపీ అధికారంలోకి వస్తే సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చిన నరేంద్రమోదీ యువతను మోసం చేశారన్నారు. వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధర కల్పించాలని, అసంఘటిత కార్మికులకు సామాజిక భద్రత కల్పించాలని తదితర డిమాండ్లతో జరుగుతున్న కార్మిక సమ్మెను విజయవంతం చేయాలని కోరారు.సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు జి. నాగరాజు, మనోజ్, కొడాలి కోటేశ్వరరావు, దొంతు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కనులపండువగా సిద్ధిగణపతి స్వామి కల్యాణం



సిద్ధిగణపతి స్వామికి అన్నాభిషేకం నిర్వహించిన భక్తులు

భట్టిప్రోలు, ఫిబ్రవరి 13 : మండలంలోని వెల్లటూరులో ఉన్న శ్రీ సిద్ధి బుద్ధి సమేత సిద్ధిగణపతి స్వామి తిరునాళ్ళ మహోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. వార్షిక ఉత్సవాలలో భాగంగా మంగళవారం స్వామివార్లకు 11 సార్లు మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, అన్నాభిషేకాలను శాస్త్రయుక్తంగా జరిపించారు. రాత్రి దేవస్థానం ప్రాంగణంలో సిద్ధిబుద్ధి సమేత శ్రీ సిద్ధిగణపతిస్వామి కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్చారణలతో వేద బ్రాహ్మణులు కల్యాణాన్ని జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి కల్యాణాన్ని తిలకించారు. ఉత్సవాలను ఆలయ ప్రధాన అర్చకులు క్రోవి శ్రీరామచంద్రమూర్తి, తిమిరిన మారుతి సత్య సాయి నిర్వహించారు. ఉత్సవాలలో భాగంగా గురువారం స్వామివారి దివ్య రథోత్సవం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఆలయ ధర్మకర్తలు తాడికొండ శేషగిరిరావు ఉత్సవాలను పర్యవేక్షణ గావించారు.

నేడు శ్రీ చిన్నజీయర్ స్వామిజీచే రామాలయ ప్రతిష్ఠ

చుండూరు ఫిబ్రవరి 13 : నడిగడ్డపాలెం ఎస్టీ కాలనీలో సమరతా సేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన శ్రీ అయోధ్య రామాలయానికి బుధవారం ఉదయం 11.14నిమిషాలకు శ్రీ త్రిదండి చిన్నశ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి వారిచే ప్రతిష్ఠా మహోత్సవం జరుపుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ఆలయ నిర్మాణానికి తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవాణి ట్రస్టు ద్వారా రూ.10 లక్షలు ఆర్థిక సహాయం అందినట్లు నిర్వాహకులు తెలిపారు. ఆలయ ప్రతిష్ఠ సందర్భంగా దేవాలయ ప్రాంగణంలో ప్రత్యేక హోమాలు, పూజలు, పూజాది కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

రాష్ట్రంలో అరాచక పాలన తరిమికొట్టాలి : టీడీపీ



పోటుమెరక గ్రామంలో కరపత్రాలను అందిస్తున్న టీడీపీ నాయకులు

రేపల్లె, ఫిబ్రవరి 13 : రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనను తరిమికొట్టేందుకు ప్రజలు సిద్ధం కావాలని రేపల్లె మండల టీడీపీ అధ్యక్షుడు రేపల్లె రామాంజనేయులు అన్నారు. మండలంలోని పోటుమెరక గ్రామంలో మంగళవారం బాబుషూరిటీ.. భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరుగుతూ వైసీపీ ప్రజా వ్యతిరేక పాలనను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తుండటంతో వైసీపీ ప్రభుత్వం వలంటీర్లను పార్టీ కార్యకర్తలుగా వాడుకుంటున్నారని విమర్శించారు. ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని అప్పుల ఊబిగా మార్చివేశారన్నారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు వడ్డే లక్ష్మీజీ, రేపల్లె సురేష్, యరగళ్ళ వీరయ్య, గోపి పాల్గొన్నారు.

పట్టణంలోని 2వవార్డులో...

రేపల్లె, ఫిబ్రవరి 13 : రానున్న ఎన్నికల్లో జగన్‌రెడ్డిని గద్దె దించేందుకు ప్రజలు సిద్ధంగా ఉండాలని టీడీపీ పట్టణాధ్యక్షులు గోగినేని పట్టాభిరామారావు అన్నారు. పట్టణంలోని 2వవార్డులో మంగళవారం బాబు షూరిటీ.. భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా టీడీపీ ప్రవేశపెట్టినున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో అధికార వైసీపీ ప్రజలను మరలా మోసం చేసేందుకు వలంటీర్ వ్యవస్థను అడ్డం పెట్టుకుని కుటిల రాజకీయాలు చేసేందుకు పన్నాగాలు పన్నుతున్నారని తెలిపారు. పట్టణంలోని 2వవార్డులో కనీసం తాగునీరు కూడా అందించలేని పరిస్థితి నెలకొందని, ప్రజలు పురపాలక శాఖాధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. సైడు డ్రైయిన్‌లలో మురుగు పేరుకుపోయి, దోమలు విజృంభిస్తున్నాయని దీంతో వార్డు ప్రజలు విషజ్వరాల బారిన పడుతున్నారన్నారు. రేపల్లె మున్సిపల్ అధికారులు అసలు పనిచేస్తున్నారా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు దామెర్ల రమేష్, తాతా ఏడుకొండలు, కేసన రామకృష్ణ, దేవగిరి రవి, దున్నా జయప్రద, నాగశ్రీ, మోర్ల అరుణ, జనసేన నాయకులు ఆర్.మహేష్, దేవగిరి శంకర్, దేవగిరి రంగా, మేకా రామకృష్ణ, వెనిగళ్ళ సుబ్రహ్మణ్యం, గుర్రం మురహరిరావు, వెలుగోటి ధర్మారావు, షేక్ ఖాదర్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

నగరం మండలంలో...

నగరం, ఫిబ్రవరి 13 : రాష్ట్రంలో వైసీపీకి కౌంట్‌డౌన్ మొదలైందని, రానున్న ఎన్నికల్లో అరాచక పాలనను తరిమికొట్టేందుకు ప్రజలు సిద్ధం కావాలని మాజీ జడ్పీటీసీ మేకా వెంకట శివరామకృష్ణ అన్నారు. నగరం మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా వైసీపీ ప్రజా వ్యతిరేక విధానాలను ఇంటింటికి తిరుగుతూ ప్రజలకు వివరించారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ-జనసేన సంయుక్త ప్రభుత్వం రానున్నదని, వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పేద, మధ్య తరతగతి కుటుంబాల వారు బతికే పరిస్థితి లేదన్నారు. రాష్ట్రంలో రౌడీపాలన కొనసాగుతుందని వైసీపీ చేస్తున్న ప్రజావ్యతిరేకవిధానాలను గొంతెత్తి ప్రశ్నిస్తే వారిపై తప్పుడు కేసులు పెట్టి నానా ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఎమ్మెల్యే అనగానికి అండగా ఉండాలని వైసీపీ ప్రభుత్వాన్ని తరిమికొట్టేందుకు సిద్ధం కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నగరం మండల పార్టీ అధ్యక్షుడు చింతల సుబ్బారావు, మాజీ ఎంపీపీ విచారపు వీరయ్య, అధికార ప్రతినిధి పీవీ చింతారావు, మైనార్టీ నాయకులు అబ్దుల్ మునాఫ్, లుక్కా గుడారంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

చెరుకుపల్లి, కనగాలలో...

చెరుకుపల్లి, ఫిబ్రవరి 13 : గ్రామసీమలు అభివృద్ధి చెందాల ంటే మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును తిరిగి ముఖ్యమంత్రిగా చేసుకోవాలని నియోజకవర్గ పొలిటికల్ మేనేజర్ పూషడపు కుమారస్వామి అన్నారు. చెరుకుపల్లి, కనగాల గ్రామాలలో జరుగుతున్న బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాల్లో మంగళవారం ఆయన పాల్గొని టీడీపీ రానున్న రోజులలో ప్రజలకు అందించే పథకాలను వివరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మల్లాది రామకృష్ణ, క్లస్టర్ ఇన్‌చార్జులను మొఖమాటం రాధాకృష్ణమూర్తి, ఉయ్యూరు శివకృష్ణ, నాయకులు నాగుల పున్నారావు, దివి రాంబాబు, కందుల వెంకటేశ్వరరావు, నాగుల నరేంద్ర, రొమ సుబ్బారెడ్డి, డి.సీతారెడ్డి, వంగర మనోహర్, ఎనుగుల కోటేశ్వరరావు, పూల సాంబయ్య, వేము మోహన్‌బాబు, విస్సంశెట్టి శ్రీనివాసరావు, జనసేన నాయకులు పాల్గొన్నారు.



విలేఖర్ల సమావేశంలో మాట్లాడుతున్న విజయబాబు, వివిధ విభాగాల పార్టీ నాయకులు

ఆనందబాబు వ్యక్తిత్వాన్ని కించపరిస్తే సహించేది లేదు

● వైసీపీ ఇన్‌చార్జి విమర్శలపై ఘాటుగా స్పందించిన టీడీపీ నేతలు

వేమూరు, ఫిబ్రవరి 13 : వేమూరు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు సోషల్ మీడియా ద్వారా మాజీ మంత్రి టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు నక్కా ఆనందబాబుపై వ్యక్తిగత విమర్శలు చేస్తూ కించపరచడంపై పార్టీ శ్రేణులు ఘాటుగా స్పందిస్తూ ఆగ్రహాన్ని వ్యక్తపరిచారు. వేమూరు టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో బాపట్ల నియోజకవర్గ పార్టీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు పార్టీ వివిధ విభాగాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు. విజయ్‌బాబు మాట్లాడుతూ వేమూరు నియోజకవర్గ ప్రజలు రాజకీయ స్థితిగతులపై ఏ మాత్రం అవగాహన లేని ప్రకాశం జిల్లా కొండేపి ప్రాంతం నుంచి వైసీపీకి ఇన్‌చార్జిగా నిన్నగాక మొన్న వచ్చిన అశోక్‌బాబు, ఆనందబాబు వ్యక్తిత్వాన్ని కించపరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. కొండేపిలో రైతుల సొమ్ము దోచుకుతిని అక్కడి ప్రజలు రైతుల చేత తరిమికొట్టబడి వేమూరుకు పార్టీ ఇన్‌చార్జిగా వచ్చిన వ్యక్తికి రెండు నెలల వ్యవధిలోనే ఇక్కడ రాజకీయ పరిస్థితులు ఏ మాత్రం అవగాహన అయ్యాయని ప్రశ్నించారు. తహసీల్దార్లు అధికార పార్టీ అండతో బెదిరించి నియోజకవర్గంలో ఆధార్ కార్డు, ఓటు కార్డులను సృష్టించుకున్న వ్యక్తి ఈ రోజున తాను స్థానికుడినని చెబితే ఇక్కడ ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు. తెలుగుదేశం పార్టీలో పెత్తందారీ వ్యవస్థ లేదని, బడుగు, బలహీన, మైనార్టీ వర్గాల వారికి ప్రతి గ్రామంలో కూడా పార్టీ పరంగా సముచితమైన స్థానాన్ని కల్పించడం జరిగిందన్నారు. వైసీపీలో ఈ రోజున కేవలం రెడ్డి కులస్తులకే పెత్తనం ఇచ్చారని మిగతా వర్గాల వారిని పూర్తిగా అనగదొక్కి అధికారంతో ఇష్టం వచ్చినట్టుగా రాజ్యాన్ని ఏలుతున్నారు అన్నారు. రాష్ట్ర మైనార్టీ విభాగం ఆర్గనైజింగ్ కార్యదర్శి షేక్ హనీఫ్ మాట్లాడుతూ అశోక్‌బాబుకు వ్యక్తిత్వం అనేది లేదు కాబట్టే కొండపి ప్రజలు తరిమికొట్టారని పరిస్థితిని గమనించిన జగన్ కూడా వేమూరుకు పంపడం జరిగిందన్నారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు దండే వెంకట సుబ్బారావు, తెలుగు రైతు సంఘం నాయకులు అమ్మిశెట్టి కిషోర్‌బాబు, ఎస్సీ సెల్ బాపట్ల జిల్లా ఉపాధ్యక్షులు దొప్పలపూడి సుధాకర్, వేల్పుల రవికుమార్, కూచిపూడి రవి శివకృష్ణ, విశ్వం, రాజేష్, గోపినాథ్, రవివరప్రసాద్, కోగంటి శ్రీనుబాబు, అన్నే ప్రసాద్, తదితరులు పాల్గొని అశోక్‌బాబు విమర్శలను తీవ్రంగా ఖండించారు.

వైసీపీనే పెద్ద పెత్తందారి పార్టీ

● అశోక్‌బాబు మాటలను ఖండించిన టీడీపీ నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

కొల్లూరు, ఫిబ్రవరి 13 : వైసీపీ, ఆ పార్టీ అధినేత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి పెద్ద పెత్తందారి అని, టీడీపీ ప్రజల పార్టీ అని ఆ పార్టీ నాయకులు అన్నారు. కొల్లూరు టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ, మాజీ ఎంపీపీ డాక్టర్ కనగాల మధుసూదన ప్రసాద్ మాట్లాడుతూ వైసీపీ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు టీడీపీ పెత్తందారి పార్టీ అని చేసిన వ్యాఖ్యలను ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, టీడీపీ అభ్యర్థి నక్కా ఆనందబాబు కూడా పెత్తందారీ వ్యవస్థకు చెందిన వాడంటూ చేసిన వ్యాఖ్యలపై వారు మండిపడ్డారు. అన్ని నియోజకవర్గాల్లో రెడ్డి కులస్తులను ఇన్‌చార్జిలుగా పెట్టిన జగన్మోహనరెడ్డి పెద్ద పెత్తందారి అని, ఎస్సీ, ఎస్టీ, బీసీ ఎమ్మెల్యేలను వేరే చోట్లకు మార్చి పెత్తందారి అని నిరూపించుకున్నాడన్నారు. నియోజకవర్గంలో అందరికి అందుబాటులో ఉంటున్న ఆనందబాబు 15 సంవత్సరాల నుంచి నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేయడంతో పాటు ప్రజాసేవలో నిమగ్నమయ్యారని అన్నారు. నియోజకవర్గంలో ప్రజలు పడుతున్న సమస్యలు తీర్చకుండా వారిని తప్పుదారి పట్టించేందుకు ప్రతిపక్ష నేతలపై ఇష్టానుసారం వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని, ప్రశాంతంగా ఉన్న నియోజకవర్గంలో చిచ్చుపెట్టాలని చూస్తున్నారని, రాబోయే ఎన్నికల్లో ప్రజలే మీకు బుద్ధి చెబుతారని ఈ సందర్భంగా హెచ్చరించారు. భవిష్యత్‌లో టీడీపీ నేతలపై లేనిపోని వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదన్నారు. సమవేశంలో టీడీపీ నాయకులు జీఎల్‌జీ భగవాన్, ధూళిపూడి కృష్ణ, శిగిలిశెట్టి రాఘవరావు, గొరికపూడి ప్రసాద్, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరుత్సాహంతోనే ఆనందబాబుపై విమర్శలు : తమ్మా

చుండూరు, ఫిబ్రవరి 13 : వేమూరు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు సోషల్ మీడియా వేదికగా మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు నక్కా ఆనందబాబుపై వ్యక్తిగతంగా చేసిన విమర్శలు ఆయన అవివేకానికి అద్దం పడుతున్నాయని తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంటరీ కమిటీ ఉపాధ్యక్షులు తమ్మా శివారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం చుండూరులో జరిగిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో వైసీపీకి స్పందన లభించకపోవడంతో నిరుత్సాహానికి గురైన అశోక్‌బాబు ఏ మాట్లాడుతున్నాడో అర్థంకాని స్థితి ఏర్పడిందన్నారు. గత పదిహేను సంవత్సరాలుగా నియోజకవర్గ అభివృద్ధికి నిబద్ధతతో కృషి చేసిన వ్యక్తి ఆనందబాబు. ఆ విషయాన్ని ఇక్కడ ఏ వ్యక్తిని అడిగినా చెబుతారు. ప్రకాశం జిల్లా కొండేపి ప్రాంత రైతులను, ప్రజలను మోసం చేసి వారు తరిమివేస్తే ఆ పార్టీ పెద్దల అండతో వేమూరులో పడ్డ అశోక్‌బాబుకు ఆనందబాబును విమర్శించే స్థాయి కాదని ఒక్కసారి నియోజకవర్గ అభివృద్ధిని చూసి మాట్లాడాలని శివారెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మోహన్‌రెడ్డి, శ్రీమాన్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

15న ఉత్తమ వలంటీర్‌లకు అవార్డులు అందజేత

పిట్టలవానిపాలెం, ఫిబ్రవరి 13 : ఫిరంగిపురంలో ఈనెల 15న ఉత్తమ వలంటీర్లకు వజ్రరత్న, సేవామిత్ర పురస్కార అవార్డులను అందజేయనున్నట్లు ఎంపీడీవో ఎంవీ రమణమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని 14 గ్రామపంచాయతీలలో వలంటీర్లు విధిగా హాజరుకావాలని ఎంపీడీవో కోరారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ పద్మజ తదితరులు పాల్గొన్నారు.

లెటర్ సిరీస్

దిక్సూచి DIKSUCHI



పార్ట్-3

1. L - NMMN - NNL - L - MN -
(ఎ) MLLMM (బి) MLMLM
(సి) LLMMM (డి) ఏదీకాదు

సమాధానం: (బి)

వివరణ: ఆప్షన్ (బి)లోని అక్షరాలను ఇచ్చిన ప్రశ్నలోని ఖాళీలలో పూరించిన సిరీస్ కింది విధంగా ఉంటుంది.

LMNM / MNLN / NLML / LMNM

ప్రతి సమూహంలోను మొదటి మూడు అక్షరాలు LMN / MNL /NLM / LMN కింది పద్ధతిని అనుసరించాయి. మొదటి సమూహంలో చివరి రెండు అక్షరాలు రెండో సమూహంలో మొదటి రెండు అక్షరాలుగా, మొదటి సమూహంలో మొదటి అక్షరం రెండో సమూహంలో చివరి అక్షరంగా ఏర్పడింది. అదే విధంగా రెండో సమూహంలోని చివరి రెండు అక్షరాలు మూడో సమూహంలో మొదటి రెండు అక్షరాలుగా, రెండో సమూహంలోని మొదటి అక్షరం మూడో సమూహంలో చివరి అక్షరంగా ఏర్పడింది. ఈ విధంగా ఒక కచ్చితమైన చైన్ పద్ధతిని ఈ సిరీస్ అనుసరించింది. అంతేకాక ప్రతి సమూహంలో రెండో అక్షరమే తిరిగి నాలుగో అక్షరంగా రిపీట్ అయింది.

∴ సిరీస్‌లో వదిలేసిన అక్షరాలు MLMLM

2. a - bcb - cac - a - aa - c
(ఎ) abcbb (బి) abbcb
(సి) abbbc (డి) ఏదీకాదు

సమాధానం: (ఎ)

వివరణ: ఆప్షన్ (ఎ)లోని అక్షరాలను ఇచ్చిన ప్రశ్నలోని ఖాళీలలో పూరించిన సిరీస్ కింది విధంగా ఉంటుంది.

aabc / bbca / ccab /aabc

ప్రతి సమూహంలోను చివరి మూడు అక్షరాలు అయిన abc / bca / cab / abc కింది పద్ధతిని అనుసరించాయి. మొదటి సమూహంలో చివరి రెండు అక్షరాలు రెండో సమూహంలో మొదటి రెండు అక్షరాలుగా, మొదటి సమూహంలో మొదటి అక్షరం రెండో సమూహంలో చివరి అక్షరంగా ఏర్పడింది. అదేవిధంగా రెండో సమూహంలో చివరి రెండు అక్షరాలు మూడో సమూహంలో మొదటి రెండు అక్షరాలుగా, రెండో సమూహంలోని మొదటి అక్షరం మూడో సమూహంలో చివరి అక్షరంగా ఏర్పడింది. ఈవిధంగా ఒక కచ్చితమైన పద్ధతిని ఈ సిరీస్ అనుసరించింది. అంతేకాక మొదటి సమూహంలో మొదటి అక్షరంగా a, రెండో సమూహంలో మొదటి అక్షరంగా b, మూడో సమూహంలో మొదటి అక్షరంగా 'c' ఉంది.

∴ సిరీస్‌లో వదిలేసిన అక్షరాలు abcbb

3. a - ab - ab - b - b - b -
(ఎ) bbabbb (బి) bbbbba
(సి) bbbabb (డి) ఏదీకాదు

సమాధానం: (సి)

వివరణ: ఆప్షన్ (సి)లోని అక్షరాలను ఇచ్చిన ప్రశ్నలోని ఖాళీలలో పూరించిన సిరీస్ కింది విధంగా ఉంటుంది.

ab / abb / abbb / abbbb

రెండో సమూహం నుంచి ప్రతి సమూహంలోను దానిముందు సమూహంలోని అక్షరాలే ఉంటూ ఒక 'b' అదనంగా చేరింది.

∴ సిరీస్‌లో వదిలేసిన అక్షరాలు bbbabb

4. L - N - LM - ML - N - LM - L
(ఎ) MMNNNN (బి) MLNMNN
(సి) MNMNMN (డి) ఏదీకాదు

సమాధానం: (బి)

వివరణ: ఆప్షన్ (బి)లోని అక్షరాలను ఇచ్చిన ప్రశ్నలోని ఖాళీలలో పూరించిన సిరీస్ కింది విధంగా ఉంటుంది.

LMNL / LMNM / LMNN / LMNL

ప్రతి సమూహంలోను మొదటి మూడు అక్షరాలుగా LMN ఉంటూ, నాలుగో అక్షరంగా మొదటి సమూహంలో L, రెండో సమూహంలో M, మూడో సమూహంలో N ఉన్నాయి. ఈ విధంగా ఒక కచ్చితమైన పద్ధతిని ఈ సిరీస్ అనుసరించింది.

∴ సిరీస్‌లో వదిలేసిన అక్షరాలు MLNMNN

5. P - QQ - RRR - P - Q
(ఎ) PPPQ (బి) PQPP (సి) PPQP
(డి) ఏదీకాదు

సమాధానం: (బి)

వివరణ: ఆప్షన్ (బి)లోని అక్షరాలను ఇచ్చిన ప్రశ్నలోని ఖాళీలలో పూరించిన సిరీస్ కింది విధంగా ఉంటుంది.

PPQ / QQR/ RRP / PPQ

ప్రతి సమూహంలోను మొదటి రెండు అక్షరాలు సేమ్. ∴ సిరీస్‌లో వదిలేసిన అక్షరాలు PQPP

6. P - P - PP - PP - P - P - PP
(ఎ) QPQPQP (బి) PQPQPQ
(సి) PPPQQQ (డి) ఏదీకాదు

సమాధానం: (ఎ)

వివరణ: ఆప్షన్ (ఎ)లోని అక్షరాలను ఇచ్చిన ప్రశ్నలోని ఖాళీలలో పూరించిన సిరీస్ కింది విధంగా ఉంటుంది.

PQPP / PPQP/ PPPQ / PPPP

మొదటి సమూహంలో ఒక P తరవాత Q, రెండో సమూహంలో రెండు Pలు తదుపరి Q, మూడో సమూహంలో మూడు Pలు తదుపరి Q ఉంటూ నాలుగో సమూహంలో నాలుగు Pలతో ఈ సిరీస్ పూర్తి అయింది.

∴ సిరీస్‌లో వదిలేసిన అక్షరాలు QPQPQP

7. a - cca - b - aab -
(ఎ) bcbc (బి) bbcc (సి) cbcb
(డి) ఏదీకాదు

సమాధానం: (బి)

వివరణ: ఆప్షన్ (బి)లోని అక్షరాలను ఇచ్చిన ప్రశ్నలోని ఖాళీలలో పూరించిన సిరీస్ కింది విధంగా ఉంటుంది.

abc / cab / bca / abc

మొదటి సమూహంలో చివరి అక్షరం రెండో సమూహంలో మొదటి అక్షరంగా మొదటి సమూహంలో మొదటి రెండు అక్షరాలు రెండో సమూహంలో చివరి రెండు అక్షరాలుగా ఏర్పడ్డాయి. అదే విధంగా రెండో సమూహంలోని చివరి అక్షరం మూడో సమూహంలో మొదటి అక్షరంగా, రెండో సమూహంలో మొదటి రెండు అక్షరాలు మూడో సమూహంలో చివరి రెండు అక్షరాలుగా ఏర్పడ్డాయి. ఈవిధంగా ఒక కచ్చితమైన చైన్ పద్ధతిని ఈ సిరీస్ అనుసరించింది.

∴ సిరీస్‌లో వదిలేసిన అక్షరాలు bbcc

8. a - bc - ab - cdabc - dab - d -
(ఎ) adbccd (బి) abcddc
(సి) abcdcd (డి) ఏదీకాదు

సమాధానం: (ఎ)

వివరణ: ఆప్షన్ (ఎ)లోని అక్షరాలను ఇచ్చిన ప్రశ్నలోని ఖాళీలలో పూరించిన సిరీస్ కింది విధంగా ఉంటుంది.

aabcd / abbcd abccd /abcdd

ప్రతి సమూహంలోను abcd అనే నాలుగు అక్షరాలు ఉంటూ మొదటి సమూహంలో a స్థానంలో రెండు aలు రెండో సమూహంలో b స్థానంలో రెండు bలు మూడో సమూహంలో c స్థానంలో మూడు cలు, నాలుగో సమూహంలో d స్థానంలో రెండు dలు ఉన్నాయి. ఈవిధంగా ఒక కచ్చితమైన పద్ధతిని ఈ సిరీస్ అనుసరించింది.

∴ సిరీస్‌లో వదిలేసిన అక్షరాలు adbccd



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్
సీనియర్ ఫ్యాకల్టీ

SCHOLARSHIP ALERT

Bhalodia-Khetan Summer Research Excellence Award

Description: Bhalodia-Khetan Summer Research Excellence Award 2024 is an opportunity offered by the Indian Institute of Technology, Gandhinagar to honor and recognise outstanding research conducted by students participating in the Summer Research Internship Program (SRIP) at IIT Gandhinagar.

Eligibility: Open for students who have completed the Summer Research Internship Programme (SRIP) under the faculty guides' evaluation at the Indian Institute of Technology (IIT), Gandhinagar.

Prizes & Rewards: An award of 50,000 (one-time)

Last Date to Apply: 05-03-2024

Application mode: Online Applications Only

Short Url: www.b4s.in/aj/BKSA1

National AIDS Control Organisation Internship Programme



Description: National AIDS Control Organisation (NACO) Internship Programme 2024 is an opportunity offered by the Ministry of Health & Family Welfare, Government of India for students pursuing undergraduate, postgraduate, M.Phil and Ph.D. degree courses in various disciplines.

Eligibility: Open for Indian nationals pursuing undergraduate, postgraduate, M.Phil, and Ph.D. degree courses in specified disciplines.

Prizes & Rewards: A monthly stipend of 8,000 and a completion certificate

Last Date to Apply: Round The Year

Application mode: via post or email at: Deputy Secretary National AIDS Control Organisation (NACO) 9th Floor, Chandralok Building, 36, Janpath, New Delhi – 110001 Email ID: naco.internship@gmail.com

Short Url: www.b4s.in/aj/NACO1

Summer Research Internship Program (SRIP)

Description: Summer Research Internship Program (SRIP) 2024 is a research opportunity offered by the Indian Institute of Technology, Gandhinagar, to students pursuing bachelor's or master's degrees at institutions in India.

Eligibility: Open for Indian nationals pursuing a bachelor's or master's degree at an Indian institution.

Prizes & Rewards: A weekly stipend of 2,000 and other benefits.

Last Date to Apply: 05-03-2024

Application mode: Online Only

Short Url: www.b4s.in/aj/SRIP2

buddy4study.com

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/pNikVWtలో చదవండి.

జాతీయ చలనచిత్ర అవార్డుల్లో కీలక మార్పులు



ప్రతిభ ప్రదర్శించిన నటీనటులు, సాంకేతిక నిపుణులకు, ఉత్తమ విలువలు కలిగిన చిత్రాలను ఎంపిక చేసి ప్రతి ఏటా ఇచ్చే జాతీయ చలనచిత్ర అవార్డుల్లో కీలక మార్పులు చోటు చేసుకోనున్నాయి. ఇప్పటి వరకూ మాజీ ప్రధాని ఇందిరాగాంధీ పేరు మీద ఇచ్చే 'ఉత్తమ తొలి చిత్ర దర్శకుడు' అవార్డ్‌ను ఇకపై ఆ పేరుతో కాకుండా 'ఉత్తమ తొలి చిత్ర దర్శకుడు' పేరుతో ఇస్తారు. అంటే అందులో ఉన్న 'ఇందిరాగాంధీ' పేరు తొలిగించారన్న మాట. ఈ విభాగంలో దర్శకుడితో పాటు నిర్మాతకు కూడా ప్రైజ్ మనీ ఇచ్చేవారు. ఇకపై దర్శకుడికి మాత్రమే ప్రైజ్ మనీ ఇస్తారు. అలాగే బాలీవుడ్ నటి నర్గిస్ పేరు మీద జాతీయ సమైక్యతను పెంపొందించే చిత్రానికి ఓ అవార్డ్ ఇస్తున్నారు. ఇకపై ఆ అవార్డులో నర్గిస్ పేరు కూడా ఉండదు. 'జాతీయ, సామాజిక, పర్యావరణ విలువలు పెంపొందించే ఉత్తమ చిత్రం' పేరుతో ఆ అవార్డ్ అందజేస్తారు. కేంద్ర సమాచార శాఖ అదనపు కార్యదర్శి నీర్జా శేఖర్ నేతృత్వంలోని కమిటీ సమావేశమై జాతీయ చలనచిత్ర అవార్డులలో కీలక మార్పులు చేస్తూ ఏకగ్రీవ నిర్ణయం తీసుకుంది. ఈ కమిటీలో కేంద్ర ప్రభుత్వ అధికారులతో పాటు సెన్సార్ బోర్డ్ చైర్మన్ ప్రసూన్ జోషి, సినీ ప్రముఖులు ప్రియదర్శన్, విపుల్ షా, ఛాయాగ్రాహకుడు నల్లముత్తు కూడా ఉన్నారు. జాతీయ చలనచిత్ర అవార్డులు 2022 కోసం ఎంట్రీలు స్వీకరించడానికి జనవరి 30తో గడువు ముగియడంతో ఈ కమిటీ సమావేశమై పలు కొత్త నిర్ణయాలు తీసుకుంది. ఈ విషయాన్ని కమిటీ సభ్యుడైన దర్శకుడు ప్రియదర్శన్ ధ్రువీకరించారు. 'నేను కూడా కొన్ని సూచనలు చేశాను. సౌండ్ విభాగానికి కూడా అవార్డులు ఇవ్వాలన్నది వాటిలో ఒకటి' అని ఆయన వెల్లడించారు.

మార్పులు ఇవే

● చలనచిత్ర పరిశ్రమకు ఇతోధిక సేవలు అందించిన చలనచిత్ర ప్రముఖులకు ఇచ్చే దాదాసాహెబ్ ఫాల్కే అవార్డ్‌కు ఇంతవరకూ రూ పది లక్షలు నగదు ఇస్తున్నారు. ఆ మొత్తాన్ని ఇప్పుడు రూ 15 లక్షలకు పెంచారు.

● స్వర్ణకమలం అవార్డ్ పొందిన వారికి ఇకపై రూ. మూడు లక్షలు, రజిత కమలం పొందిన వారికి రూ రెండు లక్షలు అందజేస్తారు. ఉత్తమ చిత్రం, ఉత్తమ తొలి చిత్రం, పూర్తి వినోదాత్మక చిత్రం, ఉత్తమ దర్శకుడు, ఉత్తమ బాలల చిత్రం .. విభాగాలకు స్వర్ణ కమలం అందిస్తారు. ఇక మిగిలిన అన్ని విభాగాలు.. అంటే ఉత్తమ ప్రబోధాత్మక చిత్రం, నటనా విభాగంలో వచ్చే అవార్డులు, ఉత్తమ స్క్రీన్‌ప్లే, ఉత్తమ సంగీత దర్శకుడు.. ఇలాంటి అన్ని అవార్డులకు రజిత కమలం అందిస్తారు.

● ఇప్పటివరకూ బెస్ట్ ఏనిమేషన్ ఫిల్మ్, 'బెస్ట్ స్పెషల్ ఎఫెక్ట్స్ ఫిల్మ్' అంటూ విడివిడిగా అవార్డులు ఇస్తున్నారు. ఇకపై ఈ రెంటినీ కలిపేసి 'బెస్ట్ ఎవిజీసీ'(యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్) పేరుతో అవార్డులు ఇస్తారు.

● బెస్ట్ ఆడియోగ్రఫీ విభాగంలో మూడు సబ్ కేటగిరిలు ఉన్నాయి. 'సౌండ్ రికార్డిస్ట్', 'సౌండ్ డిజైనర్', 'ఫైనల్ మిక్స్‌డ్ ట్రాక్ రికార్డిస్ట్' అని. ఇకపై ఇవన్నీ కలిపి 'బెస్ట్ సౌండ్ డిజైనర్' పేరుతో అవార్డ్ ఇస్తారు. ప్రైజ్ మనీని కూడా యాభై వేల నుంచి రెండు లక్షల రూపాయలకు పెంచారు.

● ఉత్తమ సంగీత దర్శకుడు పేరుతో ఇచ్చే అవార్డ్‌ను ఇకపై 'ఉత్తమ నేపథ్య సంగీతం' పేరుతో ఇవ్వనున్నారు.

● ప్రత్యేక జ్యూరీ అవార్డ్‌ను తొలగించి ఆ స్థానంలో ఫీచర్ ఫిల్మ్‌కు ఒక అవార్డ్, నాన్ ఫీచర్ ఫిల్మ్‌కు ఒక అవార్డ్ ను ఇచ్చే అధికారాన్ని జ్యూరీకి ఇచ్చారు

● నాన్ ఫీచర్ ఫిల్మ్ విభాగంలో ఇచ్చే కొన్ని అవార్డులు తొలిగించారు. మరికొన్ని కలిపేశారు. 'బెస్ట్ స్క్రిప్ట్' పేరుతో కొత్తగా ఒక అవార్డును ఏర్పాటు చేశారు.


హ్యాట్రిక్ సాధిస్తామనే నమ్మకం ఉంది

రాజేశ్ దండా



సందీప్ కిషన్, నేను, దర్శకుడు ఆనంద్ స్నేహితులం. హాస్య మూవీస్ సంస్థను ప్రారంభించి తీయాలనుకున్న మొదటి సినిమా 'ఊరు పేరు భైరవకోన'. సందీప్ కిషన్ కెరీర్‌లోనే హయ్యెస్ట్ బడ్జెట్ చిత్రం ఇది. బిజినెస్ కూడా అదే స్థాయిలో జరిగింది. అందుకే విడుదలకు ముందే హ్యాపీగా ఉన్నాం' అన్నారు నిర్మాత రాజేశ్ దండా. సందీప్ కిషన్ హీరోగా ఆయన నిర్మించిన 'ఊరు పేరు భైరవకోన' చిత్రం ఈ నెల 16న విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం మీడియాతో చిత్ర విశేషాలు పంచుకొన్నారు. నచ్చిన కథలు చేసుకుంటూ వెళుతున్నామని చెబుతూ 'మా సంస్థ సక్సెస్ ట్రాక్‌ను 'ఊరు పేరు భైరవకోన' కొనసాగించి హ్యాట్రిక్ అందిస్తుందనే నమ్మకం ఉంది. ప్రీమియర్ షోలన్నీ ఫుల్ కావడం ఈ సినిమాపై ఉన్న క్రేజ్‌కు అద్దం పడుతుంది' అని ఆయన చెప్పారు. చిత్రంలోని అంశాల గురించి వివరిస్తూ 'ఇదొక ఫాంటసీ థ్రిల్లర్. 'భైరవకోన' అనే ఊరులో ఎవరూ ఊహించని సంఘటనలు జరుగుతుంటాయి. అలాగే గరుడ పురాణం పుస్తకంలో మిస్ అయిన పేజీలకు, ఈ కథకు ఉన్న లింక్ కూడా ఆసక్తికరంగా ఉంటుంది. చిత్రంలో 47 నిముషాల అద్భుతమైన సీజీ వర్క్ ఉంది. ప్రేక్షకులకు అద్భుతమైన అనుభూతినిచ్చే సినిమా ఇది' అని రాజేశ్ చెప్పారు.

పాచికల ఆట నేపథ్యం



రాహుల్ సదాశివన్ దర్శకత్వంలో వైనాట్ స్టూడియో నిర్మించిన చిత్రం 'భ్రమయుగం'. మమ్ముట్టి కథానాయకుడు. పాచికల ఆట నేపథ్యంలో అనుక్షణం ఉత్కంఠ కలిగించే విధంగా చిత్రం ఉంటుందని దర్శకనిర్మాతలు చెబుతున్నారు. ఓ గాయకుడి జీవితంలో జరిగిన అనూహ్య సంఘటనల నేపథ్యంలో రూపుదిద్దుకున్న ఈ చిత్రం ఈ నెల 15న విడుదల కానుంది. మొదట మలయాళంలో మాత్రమే విడుదల చేసి, ఆ తర్వాత మిగిలిన భాషల్లో రిలీజ్ చేయాలని నిర్మాణ సంస్థ కీలక నిర్ణయం తీసుకుంది. 'భ్రమయుగం' చిత్రానికి సినిమాటోగ్రఫీ: షెహనాద్ జలాల్, సంగీతం: క్రిస్టో జేవియర్, మాటలు: టి.డి. రామకృష్ణన్, నిర్మాతలు: చక్రవర్తి రామచంద్ర, ఎస్.శశికాంత్.

స్నేహ గీతం



ఇంద్ర, కోమల్ నాయర్, దీప, స్వాతి శర్మ ప్రధాన తారాగణంగా స్నేహం గొప్పతనాన్ని తెలిపే కథాంశంతో రూపొందిన చిత్రం 'ట్రెండ్ మారినా ఫ్రెండ్ మారడు'. లక్ష్మణ్ జెల్ల దర్శకత్వంలో చంద్ర ఎస్ చంద్ర, డాక్టర్ విజయ రమేశ్ రెడ్డి నిర్మించారు. ఈ చిత్రం నుంచి 'నా కల' అంటూ సాగే గీతాన్ని సంగీత దర్శకుడు ఘంటాడి కృష్ణ చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ 'చిత్రీకరణ దాదాపు పూర్తయింది. కొత్త, పాత నటుల కాంబినేషన్‌లో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నాం' అన్నారు. గాయని సునీత ఆలపించిన ఈ గీతం ప్రేక్షకులను అలరిస్తుందని దర్శకుడు అన్నారు. ఇందులో తన పాత్ర సరికొత్తగా ఉండబోతోందని ఇంద్ర చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం: శ్రావణ్ భరద్వాజ. సినిమాటోగ్రఫీ: రాహుల్ మాచినేని

సామాజిక బాధ్యతతో సినిమా తీశాం



వాస్తవ సంఘటనల ఆధారంగా రూపొందిన చిత్రం 'రాజధాని ఫైల్స్'. అఖిలన్, వీణ, వినోద్‌కుమార్, వాణీ విశ్వనాథ్ కీలక పాత్రలు పోషించారు. భాను దర్శకత్వంలో కంఠంనేని రవిశంకర్ నిర్మించారు. ఈ నెల 15న చిత్రం విడుదలవుతున్న సందర్భంగా మేకర్స్ ప్రీ రిలీజ్ ఫంక్షన్ నిర్వహించారు. ఇందులో నిర్మాత మాట్లాడుతూ రైతులు స్వచ్ఛందంగా ఇన్ని వేల ఎకరాల భూములు ఇస్తే దానిని ఎగతాళి చేస్తూ, వారిని మానసిక క్షోభకు గురి చేసిన సంఘటనలు ఈ మధ్య కాలంలో చోటు చేసుకున్నాయి. దానిని స్ఫూర్తిగా తీసుకుని రైతుల పక్షాన ఒక సినిమా తీయాలని అనుకున్నాం. అయితే ఈ సినిమా ఏ పార్టీకి వ్యతిరేకం కాదు. రైతుల కన్నీళ్లు తుడిచే విధంగా సమాజాన్ని చైతన్యపరుస్తూ ఓ సామాజిక బాధ్యతతో ఈ సినిమా నిర్మించాం.. దర్శకుడు భాను అద్భుతంగా తీశారు. సినిమాకు అఖండ విజయం అందించి రైతులకు సంఘీభావం తెలియజేయాలి' అని కోరారు. ఇందులో తను రైతు పాత్ర పోషించాననీ, ఇది పొలిటికల్ ఫిల్మ్ కాదనీ, రైతుల ఆవేదనని తెలియజేసే కథ అని వినోద్‌కుమార్ చెప్పారు. ఈ సినిమాలో తను భాగం అయినందుకు ఆనందంగా ఉందని వాణీ విశ్వనాథ్ చెప్పారు. ఏడు వందల మంది రైతులతో ఈ సినిమా తీశామని దర్శకుడు భాను చెప్పారు. రాజధాని కోసం భూములు ఇచ్చిన రైతులు, మహిళలు ఇందులో నటించారని తెలిపారు. అందరికీ ఉపయోగపడే సినిమా ఇదన్నారు.

శివనాగిని సిద్ధం



సురేశ్, మమతా రాహుత్ హీరో హీరోయిన్లుగా రూపొందుతున్న చిత్రం 'శివనాగిని'. సుమన్, షాయాజీషిండే, అజయ్ ఘోష్ కీలకపాత్రలు పోషించారు. మొండెం శ్రీధర్ దర్శకత్వంలో చదలవాడ హరిబాబు నిర్మించారు. త్వరలోనే ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమైంది. తెలంగాణ సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఈ చిత్రం ట్రైలర్‌ను విడుదల చేసి సినిమా ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ "శివనాగిని'లో 30 నిమిషాల గ్రాఫిక్ సీక్వెన్స్ ఉంది. మారెడుమల్లి అడవుల్లో అద్భుతమైన లోకేషన్లలో చిత్రీకరణ చేశాం. త్వరలో విడుదల తేదీ ప్రకటిస్తాం' అని తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: జాన్ పోట్ల. సినిమాటోగ్రఫీ: యామేష్

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/9ZVu7hY లో చదవండి.



మాట్లాడుతున్న డ్వామా పీడీ అర్జునరావు

ఉపాధి పనులపై ప్రణాళికలు రూపొందించాలి

మేదరమెట్ల, ఫిబ్రవరి 13: గ్రామాలల్లో ఉపాధి హామీ పనులపై ప్రణాళికలు రూపొందించాలని డ్వామా పీడీ అర్జునరావు పేర్కొన్నారు. కొరిశపాడులోని ఉపాధి హామీ కార్యాలయం ఆవరణంలో మంగళవారం నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజా వేదికలో ఆయన మాట్లాడారు. గ్రామాలలో కూలీల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. 2023 ఏడాదిలో 828 పనులకు రూ.5.96 కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారు. సామాజిక తనిఖీలలో భాగంగా కొన్ని పొరపాట్లను గుర్తించామన్నారు. అందుకు రూ.20 వేల వరకు రికవరీ చేస్తునట్లు చెప్పారు. ఉపాధి హామీ పనులకు సంబంధించిన రికార్డులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఏపీవోకు సూచించారు. సామాజిక తనిఖీకి సంబంధించి రికార్డులు అందజేయని పంచాయతీ రాజ్, ఆర్‌డ బ్ల్యూఎస్ అధికారులపై ఆగ్ర హం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీవీవో శోభన్, ఎస్ఆర్‌పీ విజయభాస్కర్, ఏపీఎం టి.రాజారావు, ఏపీవో కోటేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

కమిషనర్‌కు శుభాకాంక్షలు తెలిపిన టీడీపీ కౌన్సిలర్‌లు

అద్దంకి, ఫిబ్రవరి 13: అద్దంకి మున్సిపల్ కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన అబ్దుల్ రషీద్‌ను మంగళవారం టీడీపీ కౌన్సిలర్‌లు కలిసి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కమిషనర్‌ను కలిసినవారిలో కౌన్సిలర్‌లు అత్తులూరి రమేష్, రంగిశెట్టి సుభాషిణి, మాగులూరి తిరుపతమ్మ, కంపా రజని, జహీరా, మాజీ జడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాసరావు, లహరి తదితరులు ఉన్నారు.

పంగులూరు తహసీల్దార్‌గా కృష్ణప్రసాద్

పంగులూరు, ఫిబ్రవరి 13: పంగులూరు మండల తహసీల్దార్‌గా జీఎస్ కృష్ణప్రసాద్ నియమితులయ్యారు. విజిలెన్స్ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయనను పంగులూరు తహసీల్దార్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ఖోఖో విజేత జిల్లా జట్టు



ఖోఖో పోటీలలో విజేతగా నిలిచిన బాపట్ల జిల్లా పురుషుల జట్టు

పంగులూరు, ఫిబ్రవరి 13: ఆడుదాం ఆంధ్ర రాష్ట్రస్థాయి పురుషుల ఖోఖో పోటీలలో బాపట్ల జిల్లా జట్టు విజేతగా నిలిచింది. 26 జిల్లాల పరిధిలో విశాఖ కేంద్రంగా జరిగిన ఈ పోటీలలో రాష్ట్రస్థాయి విజేతగా నిలిచిన బాపట్ల జిల్లా జట్టులో పంగులూరు సచివాలయం- 1 పరుషుల క్రీడాజట్టుకు పాల్గొనే అవకాశం దక్కింది. సోమవారం సాయంత్రం జరిగిన ఫైనల్ పోటీలో అనకాపల్లిపై తలపడిన బాపట్ల జట్టు విజేతగా నిలిచిందని స్థానిక కళాశాల పీడీ ఎం. సీతారామిరెడ్డి తెలిపారు.

ఉన్నత శిఖరాలకు విద్యార్థులు చేరుకోవాలి

చినగంజాం, ఫిబ్రవరి 13: మండలంలోని కడవకుదురు గ్రామంలోని జడ్పీ పాఠశాల, గ్రామ పంచాయతీ కార్యాలయం, అంగన్‌వాడీ కేంద్రాలు, సబ్ సెంటర్, జగనన్న హౌసింగ్ కాలనీలను గ్రామదర్శిని కార్యక్రమంలో భాగంగా ప్రకాశం జిల్లా జడ్పీ సీఈవో బి.జాలిరెడ్డి మంగళవారం పరిశీలించారు. కడవకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అసెంబ్లీకి ఆయన హాజరై విద్యార్థులతో మాట్లాడారు. ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని పెట్టుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని అన్నారు. ప్రభుత్వం అందజేసిన బూట్లు ఎందుకు వేసుకు రాలేదని విద్యార్థులను ప్రశ్నించారు. పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను, రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ గొల్లమూరి శివకుమారి, ఎంపీడీవో వర్రప్రసాద్, ఎంఈవో అజయ్‌బాబు, హెచ్‌ఎం కె.రామారావు, ఈవోపీఆర్డీ గోపాలకృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఆసరా చెక్కుల పంపిణీ

మేదరమెట్ల , ఫిబ్రవరి 13: స్వయం సహాయక సంఘాల మహిళలకు వైఎస్ఆర్ ఆసరా నాల్గో విడత చెక్కును వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పాణెం చిన హనిమిరెడ్డి చేతులమీదుగా పంపిణీ చేశారు. మంగళవారం మేదరమెట్ల మార్కెట్ యార్డులో జరిగిన ఆసరా చెక్కుల సంబరాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కొరిశపాడు మండలంలో మొత్తం 1071 సంఘాలలో 10,557 మంది సభ్యులు ఉన్నారు. వీరందరికి కలిపి రూ.8.48 కోట్ల చెక్కును హనిమిరెడ్డి చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ తుళ్ళూరి వెంకటరమణ, మేదరమెట్ల సర్పంచ్ బొనిగల ఎలిశమ్మ, ఏఎంసీ ఛైర్మన్ జజ్జర ఈశ్వరమ్మ ఆనందరావు, ఎంపీడీవో సమతావాది, ఏపీఎం అనూరాధ, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు జంపు హరిబాబు, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ నరసింహారావు

బల్లికురవ, ఫిబ్రవరి 13: మండలంలోని సూరేపల్లికి చెందిన చంటి సాంబిరెడ్డి (42) అనే వ్యక్తి విద్యుత్‌షాక్‌తో మృతి చెందాడు. గ్రామానికి చెందిన సాంబిరెడ్డి పాల కేంద్రంలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి గ్రామం నుంచి కొమ్మాలపాడు వద్ద ఉన్న డెయిరి వద్దకు ఏబీసీ కాలువ కట్టపై బైకుపై వెళుతున్నాడు. ఈక్రమంలో పొలాలకు పందులు రాకుండా వేసిన విద్యుత్ వైరు బైకుకి తగిలి మృతి చెందాడు. విద్యుత్ వైర్లు వేసిన రైతులు కొందరు ప్రమాదాన్ని గమనించి మృతి చెందిన సాంబిరెడ్డి మృతదేహాన్ని ప్రక్కనే ఉన్న ఏబీసీ కాలువ గుంతలో పడవేశారు. రాత్రి వెళ్లిన తన భర్త ఇంటికి రాకపోవటంతో మృతుడి భార్య సంధ్య బంధువులు మంగళవారం వెతుకులాట ప్రారంభించారు. గ్రామానికి సమీపంలోని కాలువలో చెప్పులు ఒకచోట , మృతదేహం, బైకు మరోచోట పడి ఉండటం గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే సంతమాగులూరు సీఐ నరసింహారావు, ఎస్ఐ నాగశివారెడ్డి సంఘనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి బంధువులు ఇది ప్రమాదం కాదని, విద్యుత్‌షాక్‌తో చనిపోయాడని అనుమానం వ్యక్తంచేసి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాలువ కట్టపై విద్యుత్ వైర్లు ఉన్నాయని, పొలాలకు పందులు రాకుండా రాత్రుళ్లు విద్యుత్ వచ్చేలా ఏర్పాటు చేయటం వలనే ఈ ప్రమాదం జరిగిందని మృతుడి కుటుంబసభ్యులు తెలిపారు. మృతుడికి ఒక కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఇళ్ల స్థలాల పేరుతో వైసీపీ నేతల ఆటలు

- పేదలకు పట్టాలు ఇచ్చిన చోట ఖాళీ చేయించి జగనన్న కాలనీ లేఅవుట్
- అక్కడ ఇవ్వకుండా.. స్కూల్ కోసం ప్రతిపాదనలు పంపిన చోట చదును
- ఓట్లకు గాలం వేసేందుకు తంటాలు



అద్దంకి కొండపై ఇళ్ళ స్థలాల కోసం చదును చేస్తున్న ఎక్స్‌కవేటర్

అద్దంకి, ఫిబ్రవరి13: ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో అధికారపార్టీ నేతలు ఓట్లకు గాలం వేసే తంతులకు తెరలేపుతున్నారు. ఐదేళ్ళ గుర్తుకు రాని నిరుపేదలు ఇప్పుడు ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో హడావుడిగా ఇళ్ళ స్థలాల కోసం అంటూ అద్దంకి కొండపై హడావుడి చేస్తున్నారు. మండలంలోని శింగరకొండపాలెంకు చెందిన ఎస్టీ, ఇతర సామాజికవర్గాల ప్రజలు అద్దంకి కొండను ఆక్రమించుకొని నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. అయితే, 220 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటు సమయంలో కొంతమంది ఎస్టీలకు చెందిన స్థలాలు, నివాస గృహాలని బలవంతంగా ఖాళీ చేయించి పక్కనే ఉన్న ఖాళీ స్థలం చూపించారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత శింగరకొండపాలెంలో జగనన్న కాలనీ లేఅవుట్, సచివాలయం, రైతు భరోసా కేంద్రాల కోసం అంటూ అక్కడ ఉన్న పేదలను ఖాళీ చేయించారు. కనీసం జగనన్న కాలనీ లేఅ వుట్‌లో స్థలాలు కోల్పోయిన వాళ్లకు కేటాయిస్తారని భావించారు. అయితే, వాళ్ళకు మొండిచేయి చూపించి వేరే లబ్ధిదారులకు కేటాయించారు. వేరేప్రాంతంలో కేటాయింప చేస్తామని నమ్మబలికారు. ఇప్పటివరకు వాళ్ళ స్థలాల గురించి పట్టించుకోకుండా వదిలివేసి ఎన్నికలు సమీపిస్తుండటంతో ఓట్లకు ఎర వేసేందుకు అధికారపార్టీ నేతలు పన్నాగం పన్నినట్లు తెలుస్తుంది. ఈక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్ ఏర్పాటుకోసం ప్రతిపాదనలు పంపిన స్థలాన్ని చూపించి చదును చేయించే పనిలో నిమగ్నమయ్యారు. అన్నీ విషయాలు తెలిసీ కూడా అధికార పార్టీ నేతలు ఆ స్థలాన్ని చదును చేయించటం పట్ల విమర్శలు వస్తున్నాయి. విషయం తెలుసుకున్న వీఆర్వో బాషా మంగళవారం సాయంత్రం చదును చే యించే పనులు నిలిపివేయించారు.

అరాచక పాలన అంతం కోసమే 'రా..కదిలిరా'

- ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు
- 17న ఇంకొల్లులో చంద్రబాబు సభ
- లక్షమంది లక్ష్యంగా ఏర్పాట్లు



పావులూరు రోడ్డులో స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

ఇంకొల్లు, ఫిబ్రవరి 13: అరాచక పాలనను సాగనంపేందుకే తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు రా కదిలిరా సభతో శంఖారావం పూరించనున్నట్లు ఆపార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తెలిపారు. ఈ నెల 17న బాపట్ల పార్లమెంట్ పరిధిలో రా కదిలిరా బహిరంగ సభ ఇంకొల్లులో నిర్వహించనున్న నేపథ్యంలో మంగళవారం మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్‌తో కలిసి బహిరంగ సభ స్థలాన్ని ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఏలూరి మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం సాగిస్తున్న అరాచకాన్ని వివరించి ప్రజలను చైతన్యం చేసేందుకు రా కదిలిరా పేరుతో చంద్రబాబు ఈనెల 17న ఇంకొల్లులో తారకరామ విజయభేరి ప్రాంగణంలో సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందుకు సుమారు లక్ష మంది లక్ష్యంగా భారీ ఏర్పాట్లు చేస్తున్నట్టు చెప్పారు. బుధవారం ఉదయం 9.30 గంటలకు సభా ప్రాంగణంలో భూమిపూజ చేయనున్నారు. 11.30కు పార్లమెంట్ కమిటీ సమావేశం జరుగు తుందన్నారు. హెలిప్యాడ్ కోసం భూమిని చదును చేస్తున్నారు. బాపట్ల పార్లమెంట్‌లోని ఏడు నియోజకవర్గాలు, ఒంగోలు నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభి మానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే ఏలూరి కోరారు. మంగళవారం సాంబశివరావు, నాయకులు పావులూరు రోడ్డులోని టీటీడీ కల్యాణ మండపం ఎదురుగా విద్యుత్ సబ్‌స్టేషన్‌కు మధ్యలో సుమారు 30 ఎకరాల పొలాన్ని పరిశీలించారు. సభ నిర్వహించే ప్రాంతం, పార్కింగ్, భోజనవసతికి అనువైన ప్రాంతాన్ని పరిశీలించారు. ఇంకొల్లు ప్రాంతంలో రైతువారీ కుటుంబాలు అధికంగా ఉండటంతో పాటు బాపట్ల పార్లమెంట్‌లోని నియోజకవర్గాలకు ఇంకొల్లు ప్రాంతం అందుబాటులో ఉంటుంది. ఇంతవరకు ఇంకొల్లులో చంద్రబాబునాయుడు భారీ కార్యక్రమం ఏమీ జరగకపోవడంతో రా కదిలిరా సభను నిర్వహించాలని నిర్ణయించినట్లు ఏలూరి తెలిపారు.

చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయాలి

- ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్



ఎస్ఎల్ గుడిపాడు నేతలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

బల్లికురవ, ఫిబ్రవరి 13: ఇంకొల్లులో ఈనెల 17న టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు పాల్గొంటున్న రా కదిలిరా కార్యక్రమానికి నేతలు భారీగా తరలి రావాలని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం సంతమాగులూరు మండలం పుట్టవారిపాలెం అడ్డరోడ్డు వద్ద గల ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బల్లికురవ మండలం ఎస్ఎల్ గుడిపాడు గ్రామ టీడీపీ నేతలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా పర్యటనకు వస్తున్న చంద్రబాబు బహిరంగ సభకు కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. అలాగే, వైసీపీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో అన్నివర్గాలకు లబ్ధి చేకూరేలా చేపట్టిన పథకాలను వైసీపీ ప్రభుత్వం రద్దు చేసి తీవ్ర అన్యాయం చేసిందన్నారు. ఎన్నికలు ఎప్పుడు జరిగిన టీడీపీ, జనసేన పార్టీల కూటమి విజయం తథ్యమని చెప్పారు. ప్రభుత్వ వ్యతిరేకత రోజురోజుకు పెరుగుతుందన్నారు. ఓటమి తప్పదని భావించిన జగన్‌రెడ్డి ఉద్యోగులను మార్చిన విధంగా, అభ్యర్థులను అంతర్ జిల్లాల బదిలీలు చేస్తున్నారని ఆయన విమర్శించారు. పార్టీ నేతలంతా సమిష్టిగా ఉండి పార్టీ విజయానికి కృషి చేయాలని ఎమ్మెల్యే రవికుమార్ పిలుపు నిచ్చారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు కొండేటి ఇజ్రాయల్, రావులపల్లి గోవిందు, సంపతి శౌరి, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన వివరాలు

అద్దంకి, ఫిబ్రవరి 13: ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ బుధవారం పలు కార్య క్రమాలకు హాజరుకానున్నారు. ఉదయం 9.30 గంటలకు ఇంకొల్లులో రా...కదిలి రా సభా ప్రాంగణం పరిశీలన, 11.30 గంటలకు అద్దంకి పట్టణంలోని 7వ వార్డు, 11.45కి 14వ వార్డు, మధ్యాహ్నం 12 గంటలకు ఉప్పలపాడులో జరిగే కార్యక్రమాలకు హాజరుకానున్నారు.

కుటీర పరిశ్రమగా కల్తీపాల తయారీ

- విచ్చలవిడిగా సరఫరా
- ప్రజారోగ్యంతో చెలగాటం
- పర్యవేక్షణ కరువు



ఏల్చూరులో పట్టుబడ్డ కల్తీ పాలతో ఉన్న క్యాన్‌లు

అద్దంకి, ఫిబ్రవరి 13: కల్తీ పాల తయారీ కుటీర పరిశ్రమగా మారింది. బాపట్ల, ప్రకాశం, పల్నాడు జిల్లాల పరిధిలో పలు గ్రామాలలో కల్తీ పాల తయారీ జరుగుతుంది. పాడి రైతులతో పాటు పాలసేకరణ ఏజెంట్లు కూడా కల్తీపాల తయారీ చేస్తున్నారు. దీంతో రాజుగారి పాల చందంగా మారిందన్న విమర్శలు వస్తున్నాయి. బాపట్ల జిల్లా పరిధిలోని అద్దంకి, సంతమాగులూరు, బల్లికురవ మండలాలు, ప్రకాశం జిల్లా పరిధిలోని తాళ్లూరు, ముండ్లమూరు, దర్శి మండలాలు, పల్నాడు జిల్లాలోని వినుకొండ, నూజెండ్ల, శావల్యాపురం మండలాలలోని పలు గ్రామాలలో కల్తీ పాల తయారీ జరుగుతుంది. పాల ఉత్పత్తిదారులు తమ పాలకు తోడు అదనంగా మరికొంతమేర పాలు అధికం చేసేందుకు కల్తీ పాల తయారీ చేస్తున్నారు. ఇది చాలదన్నట్లు పాల సేకరణ ఏజెంట్లు కూడా తాము సేకరించిన పాలకు తోడు అదనంగా పాల కోసం కల్తీ పాలు తయారీ చేస్తున్నారు. అదే సమయంలో ఫాట్ అధికంగా వస్తే పాల ధర ఎక్కువ ఉంటున్నందున, అందుకనుగుణంగా పామాయిల్, సన్‌ఫ్లవర్ ఆయిల్, పౌడర్ కలిపి పాల ఉత్పత్తి చేస్తున్నారు. ఇలా ఎవరికి వారే కల్తీ పాలు తయారీ చేస్తుండటంతో అసలు కంటే కల్తీ శాతమే అధికంగా ఉంటుంది. కల్తీ పాల గురించి పాల డెయిరీల నిర్వహకులకు పూర్తి అవగాహన ఉన్నప్పటికి పాలకొరత నేపథ్యంలో కల్తీ పాలను సైతం తీసుకుంటున్నారు. కొన్ని కార్పొరేట్ పాల డెయిరీలు మాత్రం కల్తీ పాలను నిరాకరిస్తుండగా, చిన్న, మధ్య తరహా డెయిరీల నిర్వహాలు పోటీని తట్టుకోలేక కల్తీ పాలను సైతం ప్రోత్సహిస్తున్నట్లు తెలుస్తుంది. గత ఏడాది అద్దంకిలో పెద్ద ఎత్తున కల్తీ పాలు పట్టుబడగా, ఇటీవల దర్శి లో కూడా పట్టుబడ్డాయి.

మంగళవారం సంతమాగులూరు మండలం ఏల్చూరులో పాలసేకరణ కేంద్రంలో అధికారులు తనిఖీలు చేయటంతో కల్తీ పాలబండారం మరోసారి వెలుగుచూసింది. అయితే, కల్తీ పాలు అని నిర్ధారణ అయినప్పటికి చర్యలు నామమాత్రంగా ఉండటంతో యథావిధిగా కల్తీపాల తయారీ జరుగుతుందన్న విమర్శలు వస్తున్నాయి. కల్తీ పాలను తాగటం ద్వారా చిన్న పిల్లలు, వృద్ధులలో అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని వైద్యులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కల్తీపాల తయారీ అరికట్టేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కల్తీపాల తయారీ కేంద్రంపై విజిలెన్స్ దాడులు



ఏల్చూరులో తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

సంత మాగులూరు, ఫిబ్రవరి 13: మండలంలోని ఏల్చూరు గ్రామంలో కల్తీ పాలతయారీ కేంద్రంపై విజిలెన్స్ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. ఏల్చూరుకు చెందిన మందా కిరణ్ గత కొంతకాలంగా పాలవ్యాపారం చేస్తున్నాడు. రైతుల నుంచి సేకరించే పాలతో పాటుగా కల్తీ పాలు తయారుచేసి డెయిరీలకు పంపి సొమ్ముచేసుకుంటున్నారు. పాల పౌడర్, పామాయిల్, సన్‌ఫ్లవర్ ఆయిల్, ఎస్ఎన్ఎఫ్ ఫౌడర్‌తో కలసి కల్తీ పాలను తయారుచేసి డైరీలకు పంపిస్తున్నాడు. పక్కా సమాచారం అందుకున్న విజిలెన్స్ అధికారులు మంగళవారం కిరణ్ ఇంటిపై దాడిచేసి తరలించేందుకు సిద్ధంగా ఉన్న 9 కల్తీ పాల క్యాన్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ క్యాన్లలో ఉన్న సుమారు 320 లీటర్ల పాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. 65 పామాయిల్ ప్యాకెట్‌లు, 35 సన్‌ఫ్లవర్ ఆయిల్ ప్యాకెట్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఫుడ్ ఇన్‌స్పెక్టర్ శాంపిల్స్‌ను సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు.

ట్రాఫిక్‌పై ప్రత్యేక దృష్టి

పర్చూరు, ఫిబ్రవరి 13: పర్చూరులో చక్రబంధంగా మారిన ట్రాఫిక్ సమస్యపై పోలీసులు దృష్టి సారించారు. పర్చూరు పట్టణం ఆయా జిల్లా కేంద్రాలకు ప్రధాన కూడలి కావటం నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగుతుంటాయి. దీంతో ట్రాఫిక్ సమస్య జఠిలంగా మారింది. ఈనేపథ్యంలో పర్చూరు నూతన ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన ఎస్.రమేష్ సమస్యపై ప్రత్యేక దృష్టిసారించారు. మంగళవారం స్థానిక బొమ్మల సెంటర్ కూడలిలో ఉన్న రహదారుల వెంబడి వ్యాపారాలు నిర్వహిస్తున్న దుకాణదారులకు తగు సూచనలు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించి ట్రాఫిక్‌కు అంతరాయం కల్గిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. ట్రాఫిక్ నియంత్రణలో ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సురేష్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



ట్రాఫిక్ సమస్యపై దుకాణదారులకు సూచనలు ఇస్తున్న ఎస్సై రమేష్



కోలలపూడి లో ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేసే పంటలను పరిశీలిస్తున్న జపాన్ అధికారుల బృందం

ప్రకృతి వ్యవసాయ పంటల పరిశీలన

మార్టూరు, ఫిబ్రవరి 13: మండలంలోని కోలలపూడి గ్రామంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటల సాగును మంగళవారం జపాన్ నుంచి వచ్చిన అధికారుల బృందం పరిశీలించారు. రాష్ట్ర అధికారి విజయ్ కుమార్ ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలను వివరించారు. వాటి వినియోగం ద్వారా ప్రజల ఆరోగ్యానికి మేలు చేకూరుతుందని తెలిపారు. ప్రకృతి వ్యవసాయంలో అమృతాలు, కాషాయాలు తయారీ, జీవా మృతం తయారీకి అవ సరమయ్యే పదార్థాలు, వాటివల్ల ఉపయోగాలను బృందానికి ప్రత్యక్షంగా చూపించారు. అనంతరం పంటల దిగుబడి, మార్కెట్ రవాణా, గిట్టుబాటు ధర తదితర వివరాలను జపాన్ అధికారుల బృందం రైతులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని రైతు బలగాని వెంకటస్వామి, మహిళా రైతు కోటేశ్వరమ్మ పండించిన పంటల ఉత్పత్తులను వారు పరిశీలించి అభినందించారు. కార్యక్రమంలో జపాన్ దేశానికి చెందిన స్టీఫెన్ కూచో, మద్యూస్ బస్తల్షియం, జకో నదల్, స్మీలా జాకబ్ లతో పాటు జిల్లా అధికారి వాణిశ్రీ, సర్పంచ్ ఎం.సతీష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేద మందులతో రోగనిరోధక శక్తి

బల్లికురవ, ఫిబ్రవరి 13: ఆయుర్వేద మందులతో విద్యార్థుల్లో రోగనిరోధక శక్తి పెరుగుతుందని అంబడిపూడి ఆయుర్వేద వైద్యశాల ఫార్మసిస్టు శేషసాయి తెలిపారు. మంగళవారం మండలంలోని కొండాయపాలెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రత్యేక క్యాంప్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి ఎండలలో విద్యార్థులకు వడదెబ్బ తగలకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. శరీరం చల్లదనంగా ఉండేలా ఆయుర్వేద వైద్యశాల ద్వారా 40 మంది విద్యార్థులకు ఛ్యావన్ ప్రాశ, ఆయుష్ 64 మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు తన్నీరు బ్రహ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రాధాన్యతాక్రమంలో సమస్యల పరిష్కారం



ఈపురుపాలెంలో రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బలరాం

చీరాల, ఫిబ్రవరి 13: మండల పరిధిలోని ఈపురుపాలెంలో ప్రధాన రహదారిని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి మంగళవారం అధికారుల తో కలసి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దెబ్బతిన్న రోడ్డుకు మరమ్మతులు చేసేందుకు చేపట్టాల్సిన చర్యలపై అధికారులతో చ ర్చించారు. పలు సూచనలు చేశారు. స్థానికులతో మాట్లాడి వారి యోగక్షే మాలను తెలుసుకున్నారు. వారు చెప్పిన సమస్యలను ప్రాధాన్యతాక్రమం లో పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు బిట్రా శ్రీనివాసరావు, నాదెండ్ల కోటేశ్వరరావు, షేక్ మస్తాన్, మున్సిపల్ డీఈ ఏసయ్య, ఆర్ అండ్‌బీ డీఈ నర్సింహులు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యల పరిష్కారంలో కేంద్రం వైఫల్యం

చీరాలటౌన్, ఫిబ్రవరి 13: రైతుల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని పలువురు నాయకులు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అధికారంలోకి వచ్చాక కేంద్రం నియంత పాలనకు పరాకాష్టగా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. ఈక్రమంలో ఈనెల 16న గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మె నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు బత్తుల శామ్యేల్, బాసి ఫైదయ్య, చిరుమల ప్రకాష్, అచ్యుతుని బాబురావు, దుడ్డు జోసఫ్, వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

419 మందికి వైద్య పరీక్షలు

చినగంజాం, ఫిబ్రవరి 13: మండలంలోని కొత్తపాలెం గ్రామ సచివాలమం ఆవరణలో రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్యశిబిరంలో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు ఎస్.విజయభాస్కరరావు, పి.సాయిశ్రీ చరణ్, ప్రత్యేక వైద్య నిపుణులు డాక్టర్ ఎస్.నాగసుబ్రమణ్యం, కె.లక్ష్మితిరుపతిమ్మలు 419 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. మొదటి విడత ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో కంటి పరీక్షలు నిర్వహించిన 70 మందికి సర్పంచ్ ఆసోది బ్రహ్మారెడ్డి కళ్ళజోళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఎంవోవో ఎస్.సుధాకర్, తహసీల్దార్ ఫణీంద్రబాబు, ఎంపీడీవో వరప్రసాద్, ఈవోపీఆర్డీ ఎన్వీ గోపాలకృష్ణమూర్తి, కార్యదర్శి బాబురావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభచాటిన డ్రీమ్స్ కళాశాల విద్యార్థులు

ఇంకొల్లు, ఫిబ్రవరి 13: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో పూసపాడు అడ్డరోడ్డు డ్రీమ్స్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచినట్లు ఆ కళాశాల కరస్పాండెంట్ పేర్ని సతీష్‌చంద్ర తెలిపారు. బద్దిగం విద్యాధరరెడ్డి 98.49 పర్సంటైల్ సాధించారు. పది మంది విద్యార్థులు 90 పర్సంటైల్‌కు పైగా సాధించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఆ విద్యార్థులను సతీష్‌చంద్ర అభినందించారు.

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి

చినగంజాం, ఫిబ్రవరి 13: గెలుపోటములను క్రీడాకారులు సమానంగా తీసుకోవాలని ఎస్ఐ ఎం.శ్రీనివాసరావు, హెచ్ఎం కుర్రా రామారావు అన్నారు. కడవకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు క్రీడాదుస్తుల పంపిణీ కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈసందర్భంగా జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బోగిరెడ్డి స్వామిరెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో ఎస్ఐ మాట్లాడుతూ క్రీడాకారులు ప్రతిభచూపి క్రీడల్లో రాణించాలన్నారు. కబడ్డీ క్రీడాకారుడు దాసరి రామకృష్ణ జ్ఞాపకార్థం వారి కుటుంబసభ్యులు, జె.పంగులూరుకు చెందిన తిరుమలపురపు రవీంద్రలు అందజేసిన స్పోర్ట్స్ కిట్‌లను ఎస్ఐ, హెచ్‌ఎంలు క్రీడాకారులకు పంపిణీ చేశారు. ఎస్ఐ శ్రీనివాసరావు పోటీలకు వెళ్తున్న క్రీడాకారుల ప్రయాణం ఖర్చుల నిమిత్తం పదివేల రూపాయలు అందజేశారు. అండర్-14, అండర్-16 విభాగాలలో 2023 డిసెంబరు 17న కడవకుదురులో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో ఎంపికైన క్రీడాకారులు ఈనెల 16 నుంచి 18 వరకు గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్‌లో నిడ్జామ్ 19వ నేషనల్ ఇంటర్ డిస్టిక్ జూనియర్ అథ్లెటిక్స్ మీట్-2024లో పాల్గొంటున్నట్టు స్వామిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్స్ జిల్లా అసోసియేషన్ కార్యదర్శి మారుబోయిన వెంకటరెడ్డి, ఉపాధ్యాయులు, కోచ్‌లు, పీడీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

టీడీపీ బాపట్ల పార్లమెంట్ ఉపాధ్యక్షుడిగా శ్రీనివాసరెడ్డి

మార్టూరు, ఫిబ్రవరి 13: టీడీపీ బాపట్ల పార్లమెంట్ ఉపాధ్యక్షుడిగా పిట్టు శ్రీనివాసరెడ్డి నియమితులయ్యారు. రేపల్లె ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ సిఫార్సు మేరకు టీడీపీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మంగళవారం ఈమేరకు ఆదేశాలు జారీ చేశారు. పార్టీ అభివృద్ధి కోసం కష్ట పడుతున్న చెరుకుపల్లి మండలానికి చెందిన శ్రీనివాసరెడ్డికి పార్టీలో సముచిత స్థానం లభించిందని పార్టీ శ్రేణులు భావిస్తున్నారు.

చంద్రబాబు మరలా సీఎం కావటం అనివార్యం

చీరాల, ఫిబ్రవరి 13: చంద్రబాబు మరలా ముఖ్యమంత్రి కావటం టీడీపీ నాయకులు పేర్కొన్నారు. మండలంలోని కావూరివారిపాలెంలో మంగళవారం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎంఎం కొండయ్య తనయుడు గౌరీఅమర్‌నాధ్ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ, భవిష్యత్ గ్యారంటీ ప్రచారం నిర్వహించారు. వైసీపీ పాలనలో నెలకొన్న సంక్షోభాన్ని వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.